epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 136 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 18 మార్చి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



## కాంగ్రెస్‌లో 'సంజయ్' చిచ్చు

తనతో కలసి పని చేయాలనడానికి ఆయన ఎవరు?

- ఇంతకు ఆయన ఏ పార్టీకి చెందిన వారో చెప్పాలి
- నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధాన్ని తెంపే కుట్ర
- తాను పార్టీ మారితే అందుకు కారణం సంజయ్ మాత్రమే
- మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

తనను కాంగ్రెస్ నుంచి బయటకు పంపించేందుకు బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను ఎవరో వెనక ఉండి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో కలిసి పనిచేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు ఆఫర్ ఇచ్చాడని సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి చెప్పారు.

**జగిత్యాల, మార్చి 17:** అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు?, తనను ఎలా కలిసి రమ్మంటారని మండిపడ్డారు. నేను ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను. కాంగ్రెస్‌ని వదిలిపెట్టడానికి సంజయ్ కారణం అవుతారు. సంజయ్‌ని ఎవరు ప్రోత్సహిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని నేను అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లోని మిత్రులు ఈ విషయంలో మాట్లాడు తున్నారు. నాకు కార్యకర్తల అభిప్రాయాలు ముఖ్యం. కాంగ్రెస్ అధిష్టానంది కూడా బాధ్యతే. నేను పార్టీని వీడటంలో సంజయ్‌ది ఒక్కటే పాత్ర కాదు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం ఉంది.. అసంతృప్తి ప్రజల్లో ఉంది. నేను పార్టీని వీడితే పార్టీ అగుతుందా?, ఒక్కడు పోతే ఆగదు. కాంగ్రెస్లోకి వచ్చిన 10 మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే పరిష్కారం. పార్టీ వారిని దూరం పెడుతుందా?. అలా అయితే కాంగ్రెస్లో సమస్యకు పరిష్కార మార్గం వచ్చినట్టే' అని జీవన్ రెడ్డి సూచించారు.

మిగతా 2 లో




## సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

సీఎం సంతకానికే దిక్కులేకపోతే ఎలా

ఎక్కడ పోయిందో సిట్ ద్వారా వెతికి పట్టండి

- ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది నిజం కాదా
- గత గవర్నర్ ప్రసంగాలకు.. నేటికి ఏం తేడా
- గవర్నర్ ప్రసంగంలోనే తప్పులు దొర్లితే ఎలా
- ఐటీ సెక్రటరీ ఎవరో వారిని తొలగించండి
- ఢిల్లీకి వెళ్ళి నిధులు తేకుండా.. నిధులు ఇచ్చి వస్తున్నారు
- 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుంది
- కాంగ్రెస్ గ్యారెంటీలకు.. ప్రభుత్వానికి జీరో వాల్యూ
- ధన్యవాద తీర్మానంపై ఎందుకు ధన్యవాదాలు తెలపాలి
- తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై కేటీఆర్ విసుర్లు



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం నడిచింది. చర్చలో కెటిఆర్ మాట్లాడుతుండగా పలు సందర్భాల్లో మంత్రులు ఆయన ప్రసంగానికి అడ్డుపడ్డారు. ఈ క్రమంలో నేనే రాజు.. నేనే మంత్రి' అని మిడిసిపడ్డ వారు సంపద మూటగట్టుకు పోలేరని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని 2023 నాటి గవర్నర్ ప్రసంగంలో ఉంది. ఏళ్లు గడిచినా సీఎం సంకల్పం, చిత్తశుద్ధి ఏమైంది? తొలి క్యాబినెట్‌లోనే ఆరు హామీలకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. బహిరంగ వేదికపై సీఎం సంతకం చేసిన దస్త్రం ఏమైందన్నారు. సీఎం ఫైల్‌కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలు ఎవరు నమ్ముతారని, మాయమైన దస్త్రం కోసం సిట్ ఏర్పాటు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు.

మిగతా 2 లో

## లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం

గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు..

కేటీఆర్ విమర్శలపై సభలో దీటుగా బదులిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి



వివరాలు 2వ పేజీలో



## రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక నిర్ణయం

విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం

చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో..

2

## పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ 'షాక్'

డ్రగ్స్ కేసు నేపథ్యంలో షోకాజ్ నోటీసు జారీ

## రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

మరో 15 రోజులకు అవసరమైన నిల్వలు

అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు సూచన

మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల

5



## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



- ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

2



## గుండె ధైర్యం

వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

- మరింత పట్టుదలగా మనం ప్రజల్లోకి వెళ్లగలగాలి
- ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్

4

## అఫ్ఘాన్‌లో పెను విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం

4





అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకి స్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మం ది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు.

## యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా అధికారి రాజీనామా

ఇజ్రాయెల్ ఒత్తిడితోనే యుద్ధం..

ట్రంప్‌కు 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ లేఖ

ఇరాన్‌తో యుద్ధం తీవ్రతరమవుతున్న వేళ అమెరికా ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న యుద్ధ కాంక్షను నిరసిస్తూ అమెరికా 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు.

3





# లెక్కలతో సహా అన్నీ వివరిస్తాం

**కేటీఆర్ విమర్శలపై సభలో దీటుగా బదులిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి**

**హైదరాబాద్, మార్చి 17:** శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను రాష్ట్ర మంత్రులు తీవ్రంగా తిప్పికొట్టారు. పదేళ్ల కాలంలో చేసిన తప్పులను మర్చిపోయి, ప్రస్తుత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని మండిపడ్డారు. ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో మహిళా సాధికారతను పూర్తిగా గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. మీ ఇంటి ఆడబిడ్డపై మీకు ఎంత గౌరవం ఉందో రాష్ట్రమంతా చూస్తోందని, కానీ రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్నచూపు చూడటం తగదని హితవు పలికారు. ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచనతో కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్న ఆరోపణలను భట్టి విక్రమార్క లెక్కలతో సహా తిప్పికొట్టారు. రాష్ట్రంలోని అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 1.06 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను వంచించిందని, తాము రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు జమ చేశామని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని సగర్వంగా ప్రకటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు తాము అసలు, వడ్డీలు కడుతూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. "మీలాగా ఇంటికో ఉద్యోగం ఇస్తామని మోసం చేయలేదు, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మాట తప్పలేదు, మూడు ఎకరాల భూమి హామీని గాలికి వదిలేయలేదు" అంటూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రాష్ట్ర అభివృద్ధికి నిర్మాణాత్మక సూచనలు చేస్తే స్వీకరిస్తామని, కానీ పనిగట్టుకుని విమర్శలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రతి కుటుంబానికి చేకూరుతున్న లబ్ధిని త్వరలోనే పూర్తి వివరాలతో సభ ముందు ఉంచుతామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం

**61 వేల మందికి 'ఫార్మర్ కిట్లు' పంపిణీ**




**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ రాష్ట్రంలో రసాయన రహిత వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా 61,125 మంది రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్ల' పంపిణీని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. సచివాలయం నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ వేదికగా రంగారెడ్డి జిల్లా రైతులకు కిట్లు అందజేసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మితిమీరిన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతిని క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, ఈ తరుణంలో పూర్వీకుల ప్రకృతి సాగు పద్ధతులే శ్రేయస్కరమని మంత్రి నొక్కి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, 61,125 ఎకరాల్లో ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం సాగు చేయడమే లక్ష్యంగా రూ. 42 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు సాగు మరియు మార్కెటింగ్‌లో తోడ్పడేందుకు క్లస్టర్‌కు ఇద్దరు 'కృషి సఖి'లను నియమించి, వారికి నెలకు రూ. 5,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. జీవామృతం, బీజామృతం వంటి జీవ ఉత్పాదకాల తయారీ కేంద్రాల ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి లక్ష రూపాయల ప్రోత్సాహకం అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదులో దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపిన అధికారులను ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 20 నుండి 22 వరకు నర్మెట్టలో 'రైతు మహోత్సవం' ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. సుమారు 150 స్టాల్స్‌తో ఏర్పాటు చేసే ఈ ప్రదర్శనలో ఆధునిక సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా మార్చి 22న ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నర్మెట్ట వేదికగా యాసంగి సీజన్ 'రైతు భరోసా' నిధులను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ. 20,600 కోట్ల రుణమాఫీని ఒకే దఫాలో చేపట్టామని, ఖరీఫ్‌లోనూ రికార్డు స్థాయిలో 9 రోజుల్లో రూ. 9,000 కోట్లు జమ చేశామని ఆయన గుర్తు చేశారు. ప్రకృతి వ్యవసాయం, ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు పెట్టుబడి తగ్గించుకుని అధిక ఆదాయం గడించాలని మంత్రి ఆకాంక్షించారు.

# నందిని సిధారెడ్డికి సీఎం అభినందనలు

**హైదరాబాద్, మార్చి 17:** ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం-2025 లభించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. నందిని సిధారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కరోనా మహమ్మారి కాలంలో మానవాళి ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను అనిమేష కవితా సంపుటిలో హృద్యంగా తెలియజేసిన మానవతావాది సిధారెడ్డి అని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో అక్షరాలను ఆయుధాలుగా మలిచి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని వ్యాప్తి చేసిన ఘనత సిధారెడ్డికి దక్కుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. పలు కవితా సంపుటాలు, రచనలతో ఆధునిక తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీవేత్తల్లో సిధారెడ్డి ముందువరుసలో ఉన్నారని సీఎం తెలిపారు.



# సిక్స్ ప్యాక్ ఫైల్ ఎక్కడ పోయింది

రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వెళ్లి నిధులు తెస్తారనుకుంటే.. నిధులు ఇచ్చి వస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. గాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుందని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీర వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని..



ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్ధాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా అని వ్యాఖ్యానించారు. ఇకపోతే 2023లో ఐటీ ఉద్యోగుల సంఖ్య 9.46లక్షలు. తాజాగా గవర్నర్ ప్రసంగంలో ఆ సంఖ్య 9.39లక్షలుగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 7వేల ఉద్యోగాలు తగ్గాయనేది వాస్తవమా? కాదా?ఉద్యోగాలు ఎందుకు తగ్గాయి? బీఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తక్కువగా వచ్చినా రాష్ట్రాన్ని దీటుగా నిలబెట్టాం. మనది కేంద్రంపై ఆధారపడే రాష్ట్రం కాదని కేటీఆర్ అన్నారు. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. 'రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్లు జీవో చూపించండి. ఇక్కడే రాజీనామా చేసి నేను వెళ్లిపోతాను' అంటూ సవాల్ విసిరారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దంటూ డిప్యూటీ సీఎంకు సూచించారు. భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలు అబద్ధమని.. రాష్ట్రంలోని మహిళలంతా చూస్తున్నారని కేటీఆర్ అన్నారు. రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నది తప్పు మాట అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వంద రోజుల్లో 6 గ్యారంటీలని సినిమా చూపించిందే కాంగ్రెస్ అని.. సోనియా గాంధీని బలిదేవత అని తాము అనలేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్‌లో 'సంజయ్' చిచ్చు

మొదటి పేజీ తరువాయి

సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారని.. కాంగ్రెస్‌లో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారన్నారు. తనకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు? అని.. తాను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా? అని ప్రశ్నించారు. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా? అని.. తమ పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయే అని జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అసెంబ్లీ లాబీల్లో చేసిన వ్యాఖ్యలపై జీవన్ రెడ్డి స్పందించారు. 'జగిత్యాల ఎమ్మెల్యే తనతో కలిసి పనిచేయాలని నాకు ఆఫర్ ఇచ్చారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు.. నన్ను ఎలా కలిసిరమ్మంటున్నారు. స్పీకర్ ఏమో సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని అంటారు.. సంజయ్ ఏమో కాంగ్రెస్‌లో కలిసి పని చేయాలని అంటారు. సంజయ్ ఎవరు నాకు ఆఫర్ ఇవ్వడానికి?. నేను పార్టీ వీడతానని ఆయనకు చెప్పానా?. వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు?. పార్టీ వీడాలనే ఆలోచన రావడానికి కారణం సంజయ్ కాదా?. మా పార్టీలోకి వచ్చి చిచ్చు పెట్టింది సంజయ్. ఏ పార్టీనో ముందు నువ్వు తేల్చి చెప్పు సంజయ్ అంటూ జీవన్ రెడ్డి ప్రశ్నలు కురిపించారు. నువ్వు ఎవరు కలిసి పనిచేయాలని అంటావు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం ఎంత బాధగా ఉంటది?. ఎంత బాధ ఎంత ఇబ్బందిగా ఉంటే పార్టీ వీడాలనే నిర్ణయం తీసుకుంటామో అర్థం చెస్కోవాలి' అని జీవన్ రెడ్డి అన్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం నాది.





బలహీన వర్గాల మహిళకు కేటాయించిన చైర్మన్ సీట్ నుంచి ఆడబిడ్డను దించేశావు. సంజయ్ చదువుకున్న వాడు, చట్టం కూడా తెలుసు. జగిత్యాల అభివృద్ధి కోసం అని 20 నెలలుగా చెబుతున్నారు. యావర్ రోడ్డు విస్తరణ ఏమైంది సంజయ్. యావర్ రోడ్డు విస్తరణ అభివృద్ధిలో భాగం కాదా?. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద మౌళిక సదుపాయాలు అభివృద్ధిలో లేవా?. నేను తీసుకునే ప్రతీ నిర్ణయం రాజ్యాంగ బద్దంగా ఉంటుంది. రాజ్యాంగాన్ని పాటించని వ్యక్తి నాకు నీతులు చెప్తున్నాడు. నేను కాంగ్రెస్లోనే ఉండాలని అనుకుంటున్నా. కానీ ఉండే పరిస్థితులు తేకపోతే ఏమి చేస్తాం. ఇంట్లో వుడుము వస్తే ఇల్లు ఇడిచి పెడతాం.. అలాగే సంజయ్ ఉడుము లాగా వచ్చి కాంగ్రెస్లో చేరాడు. ప్రజలు ఎవరికి ఏ బాధ్యత ఇస్తే అది నిర్వర్తించాలి. ప్రజలు ఇచ్చిన బాధ్యత నిర్వర్తించకుండా ఉంటే వారు ఆ పదవికి అనర్హుడు' అని జీవన్ రెడ్డి మండిపడ్డారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

**ఇఫ్తార్ వేడుకలు సామరస్యానికి నిదర్శనం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్, మార్చి 17:** జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ , తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్



వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో కానీ అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్‌అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళతాం: శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మార్చి 17:** శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే ఢిల్లీకి వెళ్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టిన మంత్రి.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల సాధన కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీ వెళ్తామని స్పష్టం చేశారు. "మేము జాతీయ పార్టీలో ఉన్నాం.. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధానమంత్రిని, కేంద్ర మంత్రులను కలవడంలో తప్పేముంది?" అని ఆయన ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీగా ఉండి కూడా గతంలో బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ చుట్టూ ఎన్నిసార్లు చక్కర్లు కొట్టారో లెక్కలు తీయాలని ఎద్దేవా చేశారు. కేటీఆర్ మహిళా సాధికారతపై హేళనగా మాట్లాడటం సరికాదని, గత ప్రభుత్వం పావలా వడ్డీ కూడా ఇవ్వలేదని.. తమ ప్రభుత్వం మహిళలకు అండగా నిలుస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. టెక్నికల్‌గా చూస్తే బీఆర్ఎస్ హయాంలో ఒక్క రూపాయి కూడా సరిగ్గా రుణం ఇవ్వలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఈరోజు ఎక్కడ ఉండేవారని, అడ్డగోలుగా మాట్లాడటం కేటీఆర్‌కు అలవాటుగా మారిందని మండిపడ్డారు. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్‌ను మించిన వారు ఈ ప్రపంచంలోనే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు ఇస్తారని ఆశించామని, కానీ కేటీఆర్ ఎవరో రాసిన స్క్రిప్ట్‌ను ఊకదంపుడు ఉపన్యాసంలా చదువుతున్నారని మంత్రి విమర్శించారు. కేవలం ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికో లేదా రాజకీయ లబ్ధి కోసమో తాము ఢిల్లీకి వెళ్లడం లేదని, కేవలం రాష్ట్ర నిధుల కోసమే ప్రధానిని కలుస్తున్నామని స్పష్టం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి వరుసగా అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పరాజయం పాలైందని, ఆ అసహనంతోనే కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారని శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు.




# రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక నిర్ణయం

## విచారణకు సిట్ ఏర్పాట్లు చేస్తూ ప్రభుత్వం ఆదేశం

## చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, మార్చి 17:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్‌ను ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన పార్టీ వ్యవహారంపై సిట్ విచారణ చేయనుంది. దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై సిట్ విచారణ జరపనుంది. ఈ డ్రగ్స్ కేసులో వీటిని ఎక్కడి నుంచి తీసుకు వచ్చారు? ఈ పార్టీలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు ఎవరు? వారికి మీకు ఉన్నా లింకులు, దుబాయ్ లింకులు తదితర అంశాలపై పలు కోణాల్లో విషయాలను రాబట్టేందుకు ఈ సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి సిట్ నివేదికను అందించనుంది. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్‌పై ఆదివారం పోలీసులు అకస్మికంగా దాడి చేశారు. ఈ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ.. కాల్పులు జరిపారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. వారిలో పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సైతం ఉన్నారు. ఆయనకు కూడా డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చింది. అలాగే పైలట్ రోహిత్ రెడ్డికి పాజిటివ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వీరిద్దరికి వారి వారి పార్టీల నుంచి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలంటూ వారికి ఆయా పార్టీలు స్పష్టం చేశాయి. అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నాయి.

# రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ 'షాక్'

## డ్రగ్స్ కేసు నేపథ్యంలో షోకాజ్ నోటీసు జారీ

## వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం.. పార్టీ కార్యక్రమాలపై నిషేధం



**హైదరాబాద్, మార్చి 17:** డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్ఠానం గట్టి షాక్ ఇచ్చింది. మొయినాబాద్ ఫామ్‌హౌస్ ఉదంతం పార్టీకి తీవ్ర అపకీర్తి తెచ్చిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మీడియా నివేదికలు మరియు విశ్వసనీయ సమాచారం ప్రకారం మాదకద్రవ్యాల వినియోగంలో ప్రమేయం ఉన్నట్లు వచ్చిన వార్తలపై ఏడు రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించింది. పార్టీ అధ్యక్షులు కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులను జారీ చేశారు. ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా అక్రమ కార్యకలాపాలను, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారం వల్ల పార్టీ ప్రతిష్టకు, విశ్వసనీయతకు భంగం కలిగే అవకాశం ఉన్నందున, క్రమశిక్షణా చర్యల కింద ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వివరణ ఇచ్చే వరకు పార్టీకి సంబంధించిన ఎటువంటి అధికారిక కార్యక్రమాల్లోనూ పాల్గొనవద్దని రోహిత్ రెడ్డికి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోగా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వని పక్షంలో, పార్టీ రాజ్యాంగం మరియు నియమావళి ప్రకారం ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే పార్టీ నుంచి బహిష్కరించడం వంటి కఠిన చర్యలు తీసుకుంటామని అధిష్ఠానం హెచ్చరించింది. చట్టపరమైన నిబంధనలు, నైతిక విలువలకు కట్టుబడి ఉండే తమ పార్టీలో ఇటువంటి నేరపూరిత ఆరోపణలు ఉన్నవారికి తావు లేదని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# రూ.కోటి దోపిడీ

## కళ్లల్లో కారం చల్లి దోచుకున్న దుండగులు

## వివరాల ఆధారంగా రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్, మార్చి 17:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతంలో భారీ దోపిడీ కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దుండగులను పట్టుకునేందుకు బృందాలు రంగంలోకి దిగాయి. సోమవారం రాత్రి సుమారు 9:40 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనలో స్కూటీపై డబ్బులు తరలిస్తున్న ఇద్దరిపై దుండగులు దాడి చేసి కోటి రూపాయల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన కూకట్‌పల్లి పిలర్ నెంబర్ 825 సమీపంలో, ఏసీపీ కార్యాలయం పక్కనే జరగడం మరింత సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం మహ్మద్ ఖుస్రూ (42), మహ్మద్ అజీముద్దీన్ (38) అనే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై కోటి రూపాయల నగదును తరలిస్తున్నారు. వీరు బహదూర్‌పురాకు చెందిన ఏసీ మెకానిక్స్. అనుమానం రాకుండా ఉండేందుకు గోల్డ్ డ్రాప్ కార్టన్ బాక్స్‌లో కోటి రూపాయలను పెట్టుకుని బైక్‌పై తరలించే ప్రయత్నం చేశారు. కూకట్‌పల్లి పిల్లర్ నెంబర్ 825 వద్ద ఏజెంట్లు డబ్బు కలెక్ట్ చేసుకున్నారు. అయితే వీరిని ముందుగానే గమనించిన దుండగులు మూడు బైక్‌లపై ఫాలో అయ్యారు. డబ్బు కలెక్ట్ చేసుకుని కేవలం 100 మీటర్ల దూరం ప్రయాణించగానే.. నలుగురు దుండగులు స్కూటీపై వెళ్తున్న వారిపై కారం పొడి చల్లి దాడి చేశారు. దీంతో బాధితులు కింద పడిపోగా.. వెంటనే నగదు ఉన్న బాక్స్‌ను తీసుకుని దుండగులు పరారయ్యారు. ఈ ఘటనలో ఉపయోగించిన బైక్‌లు ప్యాషన్ ప్లస్, ఎఫ్‌జెడ్ మోడల్స్‌గా పోలీసులు గుర్తించారు. డబ్బు హవాలా నగదై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అలాగే డబ్బు తరలింపు సమాచారం ముందుగానే తెలిసిన వ్యక్తులే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటన అనంతరం పోలీసులు బాధితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారు? ఎవరిది? వంటి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో నగరంలో భద్రతా వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# యువతకు ఉన్నత విద్యామండలి కొత్త కోర్సులు

- యూజీ అండ్ పీజీ విద్యార్థుల కోసం 39 స్పెషల్ కోర్సులు
- విజన్ 2047 లక్ష్యంగా కార్యాచరణ
- ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ యువత కోసం ఉన్నత విద్యామండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆధునిక సాంకేతికతకు అనుసంధానం చేస్తూ కొత్త కోర్సులు ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. 'యూజీ అండ్ పీజీ కోర్సెస్ న్యూ అండ్ ఎమెర్జింగ్ ఏరియాస్' అనే అంశంపై మంగళవారం టి-సాట్ వేదికగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తాము ప్రతిపాదించే కొత్త కోర్సులకు సంబంధించిన వివరాలు తమ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కలలను నిజం చేసేందుకు తెలంగాణలోని అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం సుమారు 39 కోర్సులకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి విజన్ లో భాగమైన 2047 లక్ష్యాన్ని పూర్తి చేసే ప్రయత్నంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కొత్త కోర్సులను రూపొందించా మన్నారు. అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు 19 కోర్సులు, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం మరో 10 కోర్సులను తక్షణమే ఉపాధి కల్పించేవిగా ఆచరణలోకి తేబోతున్నామని, ఏఈడీపీ( అప్రెంటీస్ ఎనేబుల్డ్ డిగ్రీ ప్రొగ్రామ్స్)లో భాగంగా మరో 10 కోర్సులు ప్రవేశపెడుతున్నామని స్పష్టం చేశారు. 2030 సంవత్సరానికీ మూడు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి పబ్లిక్ అండ్ ప్రయివేటు భాగస్వామ్యంతో తెలంగాణలోని వివిధ రంగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఏర్పడే అవకాశాలున్నాయని, ఆ ఉద్యోగాలను సాధించేందుకు తెలంగాణ యువతను సిద్ధం చేయాలన్న లక్ష్యంతో ఉన్నత విద్యామండలి పనిచేస్తుందని బాలకిష్టారెడ్డి వివరించారు. కళాశాలల్లో క్యాలిటీ టీచింగ్, మానిటరింగ్, అకడమిక్ పార్టిసిపేషన్, రీసెర్చ్ తదితర అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఛైర్మన్ సూచించారు. వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డాటా సైన్స్ వంటి ప్రత్యేక కోర్సులలో విద్యార్థులకు ప్రత్యేక అవకాశాలు కల్పించే ప్రయత్నంలో భాగంగా యూనివర్సిటీలకు, ఆయా కళాశాలకు తగిన సలహాలు-సూచనలు అందిస్తున్నామన్నారు. మండలి మరో వైస్ ఛైర్మన్ ఇటిక్యాల పురుషోత్తం మాట్లాడుతూ విద్యార్థులు కోర్సు పూర్తి చేయడంతో పాటు నైపుణ్యం తప్పని సరిగా ఉండాలని సూచించారు. ఎన్ని ఉన్నత చదువులు చదివినా నైపుణ్యం లేని చదువువల్ల ప్రయోజనం, ఉపాధి రెండూ ఉండవన్నారు. కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మాట్లాడుతూ యూనివర్సిటీ లేదా కళాశాల తాము నిర్వహించే కోర్సులకు సంబంధించి ఖచ్చితంగా ల్యాబ్స్ నిర్వహించాలని సూచించారు. కొత్త కోర్సులు ప్రారంభించి వదిలివేయడమే కాకుండా వాటిపై తప్పని సరిగా తమ వైపు నుండి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

# అబద్ధాలు, సెటైర్లు వేయడం మానుకో

- మహిళలకు ఎవరేం చేశారో వారినే అడుగుదాం
- అసెంబ్లీలో కేటీఆర్‌కు కౌంటర్ ఇచ్చిన సీతక్క



**హైదరాబాద్, మార్చి 17:** మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్‌కు చిన్నచూపని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్‌పై మంత్రి సీతక్క విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్‌కు మంత్రి చురకలంటించారు. ఫ్రీ బస్‌పై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలన్నారు. పదేళ్ళు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు. మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా బారికేడ్లు పెట్టారని.. ఇప్పుడు ఆ బారికేడ్లను తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని మంత్రి వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆరోపించారు. కేటీఆర్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలపై రూ.3000 కోట్ల భారం పెట్టిపోయిందన్నారు. కేటీఆర్ ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని అంటూ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# 20న ఫార్మసిస్ట్ పోస్టులకు జాబ్-మేళా

## 100 ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ



**హైదరాబాద్,మార్చి17:** ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 20 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలోని ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ లకు చెందిన 100 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, మరియు ఏదైనీ డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,383 నుండి రూ.19,769 వేలవరకు వేతనం ఉండే ఈ ఫార్మసిస్ట్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు. 8247656356 ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ తో నేరుగా హాజరు కావాలని ప్రకటనలో పేర్కొన్నారు.



## మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు

# చెప్పాలి: కోమటిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 17:** కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. 'రేషన్ కార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలి. యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలని అన్నారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవుపలికారు. ఈ ప్రభుత్వం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని.. వాటికి తాము వడ్డీ కడుతున్నామని.. అందుకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన జవాబిచ్చారు.

# హ్యామ్ రోడ్ల పేరుతో 18వేల కోట్ల కుంభకోణం

## కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్

## కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసం రేవంత్ సన్నాహాలు

## బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆరోపణలు



**హైదరాబాద్, మార్చి 17:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సంచలన ఆరోపణలు వెలువడ్డాయి. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ.18 వేల కోట్ల స్కాం జరుగుతోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారని.. ఇప్పుడు 10 శాతం మొబిలైజేషన్ ఇస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ఈ రకంగా రాష్ట్రంలో అతిపెద్ద కుంభకోణం జరుగుతోంది. హ్యామ్ రోడ్ల పేరుతో రూ.18 వేల కోట్ల కుంభకోణానికి తెరలేపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ లో రూ.12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో రూ.6 వేల కోట్లు కలిపి భారీ స్థాయిలో అవకతవకలు జరుగుతున్నాయి. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే అప్పటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ పెట్టారు. ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోంది. ఇందులో కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కాం గా మారే ప్రమాదం ఉంది' అని ఆరోపించారు. ఈ టెండర్లకు సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా, డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే అనుమతులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 టెండర్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుంచి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని కూడా ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, ప్రజల డబ్బును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా కీలక అధికారి రాజీనామా

## ఇజ్రాయెల్ ఒత్తిడితోనే యుద్ధం..

## ట్రంప్‌కు 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ లేఖ

**వాషింగ్టన్, మార్చి 17:** ఇరాన్‌తో యుద్ధం తీవ్రతరమవుతున్న వేళ అమెరికా ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న యుద్ధ కాంక్షను నిరసిస్తూ అమెరికా 'జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం' డైరెక్టర్ జో కెంట్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ యుద్ధం అమెరికా ప్రయోజనాల కోసం కాకుండా, ఇజ్రాయెల్ మరియు ఆ దేశ లాబీ ఒత్తిడి కారణంగానే సాగుతోందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తన రాజీనామా లేఖను పంపారు. తమ దేశానికి ఇరాన్ నుండి ఎటువంటి తక్షణ ముప్పు లేదని, కేవలం ఇజ్రాయెల్ అధికారులు మరియు అమెరికా మీడియాలోని కొందరు ప్రభావవంతమైన వ్యక్తులు చేసిన తప్పుడు ప్రచారమే ఈ యుద్ధానికి దారితీసిందని జో కెంట్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. యుద్ధం వల్ల అమెరికా పౌరుల ప్రాణాలు పోవడమే కాకుండా దేశ సంపద క్షీణిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "అమెరికా ఫస్ట్" అనే నినాదానికి ప్రస్తుత విదేశాంగ విధానం పూర్తిగా విరుద్ధంగా ఉందని ఆయన లేఖలో పేర్కొన్నారు. గతంలో ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్నప్పుడు అనుసరించిన విదేశాంగ విధానాలకు తాను మద్దతు ఇచ్చానని, అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిణామాలు ఆందోళనకరంగా మారాయని కెంట్ వివరించారు. ఇరాన్‌పై దాడి చేస్తే త్వరగా విజయం సాధించవచ్చని అధ్యక్షుడిని తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. మధ్యప్రాచ్యంలో యుద్ధాలు ఒక ఉచ్చు వంటివని, వాటిలో చిక్కుకోవడం దేశానికి క్షేమకరం కాదని చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ రాజీనామా ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.



సంపాదకీయం

# సమాజానికి చీడలా.. డ్రగ్స్ మహమ్మారి!

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడంలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినాబాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరిపోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధి కారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తి స్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.

# మీ సాయం మాకక్కర లేదు

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హార్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక



**వాషింగ్టన్, మార్చి 17:** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా–ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# అఫ్ఘనిస్థాన్‌లో పెను విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం







**కాబూల్, మార్చి 17:** అఫ్ఘానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్ఘానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసి పడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని ఆఫ్ఘానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందన్నారు. 400 మంది వరకు మరణించారని.. 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷–గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఎ÷–గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఎ÷–గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఎ÷–గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

**అఫ్ఘాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి**

**పాక్ తీరును తీవ్రంగా తప్పపట్టిన భారత్**




**న్యూఢిల్లీ,మార్చి 17:** అఫ్ఘానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్ఘానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఫ్గాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

# ఇటానగర్‌లో విరిగిపడ్డ కొండచరియలు


**గోడకూలి నలుగురు మృత్యువాత**

**ఇటానగర్,మార్చి17:** కొండచరియలు విరిగిపడడంతో గోడ కూలి నలుగురు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయని ఇటానగర్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇటానగర్‌లో నీతి బీహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిని చోకి తసర్, రతన్ బర్మాన్, గోడక్ రాజా, గోడక్ టాబిన్‌లుగా అధికారులు గుర్తించారు. నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్ఎఫ్ బృందం, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. రెస్క్యూ బృందం ఘటనా స్థలం నుంచి నాలుగు మృతేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు అని ఇటానగర్ ఎస్పి జుమార్ బసర్ మీడియాకు వెల్లడించారు.

# ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

**మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్**

**లక్నో,మార్చి17:** యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఏటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. బిడిఎస్ (డెంటిస్ట్) రెండో సంవత్సరం చదువుతున్న హారీష్ అలీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు సెషన్, డిస్కార్డ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్‌ల ద్వారా ఐసిస్ సభ్యులు, సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నాడని అధికారులు పేర్కొన్నారు. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, దేశంలో ఉగ్రవాద సంస్థను బలోపేతం చేయడానికి వ్యక్తులను నియమించడం లక్ష్యంగా ఆన్‌లైన్ గ్రూపులను సృష్టిస్తున్నారని ఏటిఎస్ తెలిపింది. నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును కూడా నడిపారని, భారత్‌తో పాటు విదేశాల్లో ఐసిస్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు. లక్నోలోని ఏటిస్ పోలీస్ స్టేషన్‌లో యుఎపిఎ మరియు బిఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఏటిఎస్ పేర్కొంది.





# ఉగాది కానుకగా 'దివ్యాంగ శక్తి'

**నినేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

**స్త్రీ శక్తి స్ఫూర్తితో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం..**

**సహాయకులకు 50 శాతం రాయితీ**

**అమరావతి, మార్చి 17(మనసులో మాట):** రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'స్త్రీ శక్తి' పథకం ఘనవిజయం సాధించడంతో, అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కోసం 'దివ్యాంగ శక్తి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఉగాది పండుగ కానుకగా ఈ సరికొత్త పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మంగళగిరిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొననున్నారు. పథకం ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి మరియు ఇతర నేతలు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందులో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11.16 లక్షల మంది దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తిస్తుంది. కేవలం దివ్యాంగులకే కాకుండా, వారి వెంట వచ్చే సహాయకులకు (ఎవశ్రీజూవతీం) టికెట్ ధరకు 50 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 4 నుంచి 21 రకాల వైకల్యాలు ఉన్న వర్గాల వారందరికీ ఈ పథకాన్ని విస్తరించారు. దీనివల్ల దాదాపు 12.76 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఇప్పటికే అమలవుతున్న స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 52 కోట్లకు పైగా మహిళలు ప్రయాణించగా, ప్రభుత్వం రూ. 1,826 కోట్లు భరించింది. ఇప్పుడు దివ్యాంగ శక్తి పథకం అమలు కోసం ఏటా రూ. 207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ బుధవారం స్థానిక ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. గతంలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, ఉగాది పండుగ ముందే ఈ పథకాన్ని అమలులోకి తీసుకురావడంపై దివ్యాంగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్త్రీ శక్తి బస్సుల్లోనే దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించడం ద్వారా సామాజిక భద్రతలో రాష్ట్రం మరో అడుగు ముందుకు వేసిందని ప్రభుత్వం పేర్కొంది.




# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలని మంత్రి సూచించారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం భోజనం

**ఆరోపణలు రావడంతో లోకేశ్ ఆకస్మిక తనిఖీ**

**విజయవాడ, మార్చి 17(మనసులో మాట):** మైలవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తారక రామానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంపై విద్యార్థులను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. 'భోజనం రోజూ బాగోవడం లేదా? ఆ ఒక్క రోజే బాగోలేదా?' అంటూ విద్యార్థులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం బాగుంటుందంటూ మంత్రికి బదులిచ్చారు విద్యార్థులు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆ తర్వాత సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆయన సందర్శించారు. అందులోని చిన్న పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఆ తర్వాత పాఠశాల స్థితిగతులపై మైలవరం ఎంఈవో, హెడ్‌మాస్టర్‌తో లోకేశ్ మాట్లాడారు. ఆ క్రమంలో తనతో పాటు తెచ్చిన నివేదికపై ఎంఈఓతో లోకేశ్ చర్చించినట్లు తెలుస్తోంది. న్నతాధికారులు, పార్టీ శ్రేణులుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రి లోకేశ్ ఈ పాఠశాలను సందర్శించారు. లోకేశ్ పర్యటనపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కూ ఎలాంటి సమాచారం అందలేదని తెలుస్తోంది. మంత్రి లోకేశ్ రాకను తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు మైలవరానికి పరుగులు తీశారు.





# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

మొదటి పేజీ తరువాయి

సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷ాష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని పైరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷-రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.




# గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

**ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్**

**అమరావతి, మార్చి 17(మనసులో మాట):** గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జగన్‌ది మాత్రమే కాదు.. వైఎస్సార్‌సీపీ అంతా కలిసి కట్టుగా నిర్మించుకున్నాం. వైఎస్సార్‌సీపీ విలువలు,విశ్వసనీయత మీద పుట్టింది. అదే పునాదుల మీద కొనసాగుతోంది. గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్,మనం మంచి చేశాం. కాబట్టే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. మన పాలనకు, బాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు. ప్రతి ఇంట్లోనూ ఇదే చర్చ జరుగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. వైఎస్ జగన్ భేటీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అవినీతి కోసం మాత్రమే వాళ్లు అధికారంలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. మనం అధికారంలోకి వచ్చినప్పుడు అద్భుతమైన రాష్ట్రాన్ని ఇచ్చినట్లు బాబు బిల్డప్. వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసి అప్పగించారు. కేవలంలో ఖజానాలో రూ.100కోట్లు మాత్రమే ఉంచారు. తర్వాత కోవిడ్ లాంటి కష్టాలు ఎదుర్కొన్నాం. ఆర్థికంగా ఒత్తిళ్ల మధ్య మన పరిపాలన సాగింది. ప్రజలకు ఇచ్చిన మాటను ఎప్పుడూ వదిలి పెట్టలేదు. దేశ చరిత్రలో జరగని విధంగా హామీలు అమలు చేశాం. ముందుగానే క్యాలెండర్ ఇచ్చి హామీలను అమలు చేశాం. బడ్జెట్‌లో క్యాలెండర్ పెట్టి పథకాలు అమలు చేశాం. పేదలను, మధ్యతరగతి ప్రజలను ఆదుకున్నాం. మన హయాంలో రూ.3.31లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.2.7లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశాం. రెండేళ్లకే చంద్రబాబు కమిటెడ్ అప్పులు.. గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి. చంద్రబాబు హామీలు మోసాలుగా తేలిపాయా యని వైఎస్ జగన్ అన్నారు. 'మన పథకాలన్నీ చంద్రబాబు నాయుడు రద్దు చేశారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్లిపోయాయి. జగన్ ఏం చేయగలిగాడు. బాబు ఎందుకు చేయలేక పోతున్నాడని చర్చిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా మనం పథకాలు అమలు చేశాం. ఇప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇదే కొనసాగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదు. అమరావతి పనుల్లో తీవ్రమైన అవినీతి. భూములను శెనక్కాయలకు, బెల్లానికి ఇచ్చేస్తున్నారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డారు. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ ఆయనే. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణం అన్నారు. చంద్రబాబు ఒక పాలకుడిగా వ్యవహరించడం లేదు. మోసం చేశారని బాధితురాలు సీఎంకు ఫిర్యాదు చేస్తే కమిటీలు వేస్తామంటున్నారు. ఆదిమూలం మహిళపై లైంగిక దాడి చేస్తే పంచాయతీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపల్‌పై వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నో యాక్షన్. మహిళలకు అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్ అన్నారు. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీద నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీద కూడా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడితే నో యాక్షన్. తన కొడుకు స్విమ్మింగ్? పూల్స్? వద్ద తాగుతు, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తే నో యాక్షన్ అన్నారు. తన బావమరిది మహిళలపై నీచంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని బాబు అన్నారు. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు. చంద్రబాబుకు ఇక మిగిలింది రెండేళ్లే. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికలున్నాయి. మధ్యలో నా పాదయాత్ర కూడా ఉంటుంది. జగన్ 2.0 లో కార్యకర్తలకు పెద్దపీట. కార్యకర్తల ద్వారానే ప్రజలకు మరింత మంచి' అని అన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఒక్కరిది కాదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్మించిన పార్టీ అని జగన్ పేర్కొన్నారు. పార్టీ విలువలు, విశ్వసనీయత మీదే పుట్టిందని.. అదే పునాదులపై ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. గత 16 సంవత్సరాల్లో ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశామని, గుండెధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్ జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను కచ్చితంగా పాటిస్తూ ముందుగానే క్యాలెండర్ ప్రకటించి పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఆర్థిక ఒత్తిళ్లు, కోవిడ్ వంటి సంక్షోభాల మధ్య కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచామన్నారు. వైసీపీ హయాంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. సీఎంచంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేకపోయారని వైఎస్ జగన్ ఆరోపించారు. రెండేళ్లలోనే భారీ అప్పులు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలను రద్దు చేసి ప్రజలను నిరాశపరిచారని అన్నారు. అమరావతి అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదని, దోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. చుండూరు రవికి పూర్తి మద్దతు ఉంటుందని, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలతో దగ్గరగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని జగన్ సూచించారు.



# డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ

**పార్లమెంట్ చరిత్రలోనే ఇదే తొలిసారి**

**అయినా ఎంపీ పుట్టా మహేశ్‌పై చర్యలేవీ**

**ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు**

**మండిపడ్డ వైసీపీ అధినేత జగన్**

**అమరావతి, మార్చి 17:** పార్లమెంట్ చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ పుట్టా మహేషే అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారం పుట్టా మహేష్‌తో మొదలై, పుట్టా మహేష్‌తో ఆగిపోలేదన్నారు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు. తప్పు చేసిన వారిపట్ల చంద్రబాబు చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, మోసాలపై కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. కోనేటి ఆదిమూలం మహిళపై లైంగిక దాడిచేస్తే చర్యలు లేవని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం. ఒక పాలకుడిగా ఆయన వ్యవహరించలేదు. తప్పు చేసిన వారిపట్ల తయన చర్యలు తీసుకోలేదు. అందుకనే విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అత్యాచారాం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్' అంటూ వైఎస్ జగన్ ÷ర్ అయ్యారు. 'ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన సీఎం చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి. తన కొడుకు స్విమ్మింగ్ పూల్స్ వద్ద తాగుతూ, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్సులు చూస్తే నో యాక్షన్. తన బావమరిది అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలని అని బహిరంగంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. లాగి చెంపకేసి ఒక్కటి పీకాల్సింది పోయి... చేసిందేమిటన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ మార్చి17( సమయం న్యూస్). :** అక్రమ మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హెచ్చరించారు.మంగళవారం సారంగాపూర్ మండలంలోని జాం గ్రామ చెరువు సమీపంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల అవసరాల కోసం మొరం తవ్వకాలు చేపట్టాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే తవ్వకాలు చేయాలని సూచించారు. అక్రమ మొరం తవ్వకాలపై రెవెన్యూ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశించారు.మొరం, ఇసుక అక్రమ తవ్వకాలు చేసే వారిపై అలాగే అక్రమంగా రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, మైనింగ్ అధికారి హరి ప్రసాద్, తహసిల్దార్ సంధ్యారాణి, రెవెన్యూ అధికారులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం “షీ” టీమ్ ప్రత్యేక చర్యలు:

● పరిగి సబ్‌డివిజన్ “షీ” టీమ్ ఇంచార్జ్ నర్సిములు

● జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అదేశాలమేరకు



**కొడంగల్, మండలం,మార్చి,17(సమయం న్యూస్) :** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న “షీ” టీమ్ సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ “షీ” టీమ్ ఇంచార్జ్ నర్సిములు అన్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో కొడంగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంగడిరైచుర్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ లో పరిగి సబ్‌డివిజన్ “షీ” టీమ్ ఇంచార్జ్ నర్సిములు ఆద్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళీధర్ సమక్షంలో పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు.ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, “షీ” టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థులు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మురళీధర్ , ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని, విద్యార్థులు, “షీ” టీమ్ సభ్యులు సావిత్రి, పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం.

● రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం.

● సబ్సిడీ పరికరాల పంపిణీ లో ఎఎంసీ చైర్మన్ కనకయ్య.



**రాయపోల్, మార్చి 17:** రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ ప్రగతిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా రాయపోల్ మండల కేంద్రంలో ఎఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య ఆధ్వర్యంలో మంగళవారం సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులకు రోటవేటర్,కల్టివేటర్,స్ట్రాబెలర్, పవర్ స్ప్రేయర్ తదితర ఆధునిక వ్యవసాయ పరికరాలను అందజేశారు.ఈ పరికరాలు వ్యవసాయ పనులను వేగవంతం చేసి,ఖర్చులను తగ్గించడంతో పాటు దిగుబడులు పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రైతులు తెలిపారు.ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు. రైతులకు ఆధునిక సాంకేతికతను చేరువ చేస్తూ,సబ్సిడీ పథకాల ద్వారా ఆర్థిక భారం తగ్గించే దిశగా ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేష్,ఏఈఓ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలు,మౌలిక వసతులు,ప్రణాళికల రూపకల్పన లో జనాభా గణన ఉపయోగపడుతుంది

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ మార్చి17( సమయం న్యూస్) :** మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో చార్జి అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న తొలి జనగణన అని, 2011 జనాభా గణన తర్వాత 2021 లో నిర్వహించవలసిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా ఆలస్యంగా జనాభా గణన 2027 లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గత కొన్ని సంవత్సరాలలో జనాభా పరంగా, పరిస్థితుల్లోటి గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, తెలిపారు.జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్,హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జన గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు.ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15 రోజుల ముందు అంటే ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా,తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.జనాభా లెక్కలు సేకరించడం ఒక ముఖ్యమైన బాధ్యతతో పాటు సవాలుతో కూడుకున్న పని అని ఆమె పేర్కొన్నారు. అందుకు అధికారులు శిక్షణ లో తెలియచేసే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలని,ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారుప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని తప్పకుండా గణనలో చేర్చాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలను కూడా గణనలో చేర్చి వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, పైస్థాయి అధికారులతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించుకుని జనగణనను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ కార్యాలయం ఏ.డి .రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ చేయడం ,స్వయంగా చేయడం శిక్షణ లో వివరించారుజిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జన గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో జడ్.పి. సి.ఇ.ఓ,ఇంచార్జి డి.పి.ఓ వెంకట రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్,జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్,జిల్లా మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్ ల సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

● నిరంతర పర్యవేక్షణ ముఖ్యం

● జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగాం మార్చి17( సమయం న్యూస్) :** మంగళవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, ఇతర సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరా, నిల్వలపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లాస్థాయి గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ (డీఎల్ఈఎస్ఎంసీ) సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ అమలు, ప్రస్తుత గ్యాస్ సరఫరా, నిల్వల పరిస్థితిపై క్షుణ్ణంగా ఆయా శాఖల సంబంధిత అధికారుల ద్వారా ఆరా తీశారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం (12) గ్యాస్ ఏజెన్సీల పరిధిలో డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పౌరసరఫరాల విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద ఉన్న నిల్వలను గమనిస్తూ ఉండాలని, వినియోగదారులతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, అలాగే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ కమిటీ సభ్యులు గ్యాస్ సరఫరా ఇబ్బందులపై పరిశీలన చేయాలన్నారు. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను కమర్షియల్ గా వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అదే విధంగా జిల్లాలో గ్యాస్ సిలిండర్ లను రవాణా చేస్తున్న వాహనాలకు జీపీఎస్ ట్రాకర్ ను పక్కాగా అమర్చి, ఆ వాహన స్థానం ఎక్కడ ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.రెండు కంటే ఎక్కువ సిలిండర్లు ఉంటే, ఆ సిలిండర్లను సీజ్ చేయాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద పటిష్ట భద్రత నడుమ వాహనాలను తనిఖీ చేయాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లాలో కనీసం 5 రోజులకు సరిపడా నిల్వలు ఉండే విధంగా సరిచూసుకోవాలని ఎల్పీజీ సభ్యులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు రవీందర్, హసీనా బేగం, విక్రమ్, డీడబ్ల్యూఓ కోదండరాములు, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఇతర సంబంధిత అధికారులు, గ్యాస్ డీలర్ల సంఘం ప్రెసిడెంట్, సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ లు, తదితరులు పాల్గొన్నారు.



# దళిత జర్నలిస్టు శేఖర్‌కు న్యాయం జరగాలి - గడ్డం ఝాన్సీ

**చేవెళ్ల, మార్చి 17:** అన్యాయానికి గురైన బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపబోమని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దళిత స్త్రీ శక్తి వ్యవస్థాపకులు గడ్డం ఝాన్సీ పిలుపునిచ్చారు.ఇటీవల దాడికి గురైన దళిత జర్నలిస్టు శివగళ్ల శేఖర్ చేవెళ్లలోని నివాసాన్ని మంగళవారం హైదరాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ బుజ్జిబాయ్‌తో కలిసి సందర్శించారు. శేఖర్‌ను పరామర్శించి, ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గడ్డం ఝాన్సీ మాట్లాడుతూ, చేవెళ్ల నియోజక వర్గంలోని పలు ప్రాంతంలో నిత్యం దళితులపై దాడులు జరుగుతునే ఉన్నాయని, వాటిని అరికట్టే ప్రయత్నం చేస్తున్నామని వారు చెప్పారు. దళితులపై దాడులు జరిగినప్పుడు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.ఒత్తిళ్లకు లొంగవద్దు: కేసుల విషయంలో పోలీసులు, స్థానిక నాయకులు లేదా ఇతరుల నుంచి ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉందని, వాటికి లొంగకుండా చట్టంపై నమ్మకంతో పోరాడాలని సూచించారు. అదే విదంగా నిందితులు డబ్బు ఆశచూపి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తారని, అటువంటి ప్రలోభాలకు గురికావద్దని హెచ్చరించారు.బాధితులకు ప్రభుత్వం నుంచి అందే చట్టపరమైన ఆర్థిక సహాయంపై ఆమె అవగాహన కల్పించారు. దళితులపై దాడులు జరిగినప్పుడు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు.ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: షాబాద్ మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన తాళ్లపల్లి మల్లేష్‌పై జరిగిన దాడి గురించి కూడా ఆమె ఆరా తీశారు. నిందితులకు కఠిన శిక్ష పడే వరకు అవసరమైతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.బాధితులకు దళిత స్త్రీ శక్తి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ధైర్యంగా పోరాడాలని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత స్త్రీ శక్తి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఖోడద్ అభివృద్ధికి ఉద్యోగుల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**తలమడుగు మార్చి17( సమయం న్యూస్) :** మంగళవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ, గ్రామంలో విజ్ఞానాన్ని పంచేందుకు లైబ్రరీని ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుండి ఎదిగిన ఉద్యోగులు తమ ప్రాంతంపై మమకారంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో ‘తెలంగాణ రైజింగ్ 2047’ బ్లూప్రింట్‌ను సిద్ధం చేసిందని తెలిపారు. ఈ అభివృద్ధిలో గ్రామాలు కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే యువతకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. సివిల్ సర్వీసెస్ వంటి కఠినమైన పరీక్షలను సాధించాలంటే పట్టుదల, సరైన ప్రణాళిక అవసరమని తన సొంత అనుభవాలను కలెక్టర్ యువతతో పంచుకున్నారు. గ్రామంలోని ఉద్యోగులంతా కలిసి యువతకు కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాలపైనే కాకుండా, స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ రంగాల్లో కూడా రాణించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారుతహసీల్దార్ రా జ్ మోహన్, ఎంపీడీఓ శంకర్, గ్రామ ఉద్యోగుల సంఘం సభ్యులు వెంకట్, నర్సింలు, చంద్రారెడ్డి, అనిల్ రెడ్డి, స్వామి, అశోక్, భోజా రెడ్డి, గౌతమ్, గోవర్ధన్, లలిత, స్వామి, గ్రామ యువత, గ్రామస్తులు, గ్రంథాలయ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

- ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య
- ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలి- ట్రాఫికె ఎస్సై
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, మార్చి,17(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో యువత మరియు వాహనదారులు రాష్ డ్రైవింగ్ (మితిమీరిన వేగం)తో వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలకు అధిక శబ్దం వచ్చేలా మార్పులు చేసిన సైలెన్సర్లు ఉపయోగించడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య హెచ్చరించారు.మంగళవారం నాడు నారాయణపేట జిల్లా కేంద్రంలోని సావర్కర్ చౌరస్తాలో యు-వతకు, వాహనదారులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ...రాష్ డ్రైవింగ్ వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టం కలిగించవచ్చని అన్నారు. ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా యువత వేగ పరిమితులు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని కోరారు.అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు అమర్చడం చట్ట విరుద్ధమని, ఇటువంటి వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని జరిమానాలు విధిస్తామని తెలిపారు. అలాగే హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు.తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ ఉంచాలని, వారు రాష్ డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా మాత్రమే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్సై పేర్కొన్నారు.

# ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలో స్పెల్ బి కార్యక్రమం.



**కరీంనగర్ మార్చి17( సమయం న్యూస్) :** ఈరోజు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని PM శ్రీ పాఠశాలలకు జిల్లాస్థాయి మాడల్ యునైటెడ్ నేషన్స్( MUN). SPELL-Bee కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.. 22 పాఠశాలల నుండి వీఖచీ కార్యక్రమానికి 40 మంది విద్యార్థులు హాజరు కావడం జరిగింది.. మోడల్ యునైటెడ్ నేషన్స్ లో 11 మంది విద్యార్థులు.. జిల్లా స్థాయిలో సెలెక్ట్ చేయడం జరిగింది. రాష్ట్ర స్థాయిలో జరిగేటువంటి మోడల్ యూనిట్ నేషనల్ కార్యక్రమానికి ఈ విద్యార్థులు హాజరవడం కావడం జరుగుతుంది. Spell Bee కార్యక్రమానికి పీఎం శ్రీ పాఠశాల నుండి 36 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది వీరిలో పది మంది విద్యార్థులను.. ఑ాజూవశ్రీశ్రీ దీవవ.కాంపిటీషన్ కింద సెలెక్ట్ చేయడం జరిగింది. ఈ రెండు కార్యక్రమాల్లో గెలుపొందినటువంటి విద్యార్థులకు వె-ఎమెంటోలు సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది... ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీ అశోక్ రెడ్డి గారు, డిసిఇబి కార్యదర్శి శ్రీ భగవంతయ్య గారు.. జిల్లా సైన్స్ అధికారి శ్రీ జయపాల్ రెడ్డి గారు.. హాజరైనారు.. మోడల్ యునైటెడ్ నేషన్స్ న్యాయ నిర్ణేతలుగా బి. తిరుపతి, ఏ కుమారస్వామి. ఆర్.పవన్ కుమార్.. ఑ాజూవశ్రీశ్రీ ఎవవ నిర్వహణకు ఎఆఖుఎస్ఘ్రుతీ ≂ుయబ , శివకుమార్ మంజుర్ అలీ.. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల నుంచి వచ్చినటువంటి విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరైనారు.

# డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్ కీలకం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- వార్తలాప్ వర్క్ షాప్ తో జర్నలిస్టులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన
- పి ఐ బి అడిషనల్ డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్



**సంగారెడ్డి, మార్చి 17( సమయం న్యూస్). :** ప్రస్తుత డిజిటల్ యుగంలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కృత్రిమ మేధస్సు ద్వారా తయారవుతున్న కంటెంట్, తప్పుదారి పట్టించే చిత్రాలు, తప్పుడు సమాచారాన్ని గుర్తించి నిజమైన వార్తలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఆమె అన్నారు.ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో "వార్తలాప్ (౻ూ≂ూుూూ)" పేరుతో జర్నలిస్టులకు ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లింగ ఆధారిత హింస, మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, జర్నలిజంలో కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 130 మంది జర్నలిస్టులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో ఫ్యాక్ట్ చెకింగ్‌కు అత్యంత ప్రాధాన్యం పెరిగిందన్నారు. చిన్న తప్పుదారి పట్టించే సమాచారం కూడా సమాజంలో భయం, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని పేర్కొన్నారు .మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంలాంటిదని పేర్కొన్నారు .ప్రభుత్వ పాలసీలు, పథకాలు మరియు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆమె అన్నారు. జర్నలిస్టులు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన వార్తలను అందించాలని సూచించారు.ఈ తరహా వర్క్‌షాప్‌లు జర్నలిస్టులు నూతన పరిజ్ఞానాన్ని తెలుసుకుని తమ వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు.పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల అధికారిక సమాచారాన్ని ప్రజలకు ఖచ్చితంగా చేరవేయడంలో పీఐబీ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తున్న ఈ కాలంలో తప్పుడు వార్తలను గుర్తించి ఖండించడంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ముఖ్యమైన బాధ్యత నిర్వర్తిస్తున్నదని తెలిపారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల గురించి ఆమె వివరించారు.లింగ సమానత్వం మరియు మహిళల సంక్షేమ పథకాలపై సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల మాట్లాడుతూ, లింగ సమానత్వం కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, పిల్లల్లో సరైన దృక్పథాన్ని తల్లిదండ్రులు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడంలో జర్నలిస్టుల పాత్ర కూడా కీలకమని చెప్పారు.జర్నలిజంలో ఏ ఐ వినియోగంపై సత్యప్రియ వివరించారు. నోట్‌బుక్ కేఎల్ఎం, చాట్ జీపీటీ, గూగుల్ పిన్‌పాయింట్, ఎలెవన్ లాబ్స్, జెమినీ ఏ ఐ వంటి పలు ఏ ఐ సాధనాలను ఎలా ఉపయోగించాలో వివరించారు. అయితే ఏ ఐ వేదికలపై వ్యక్తిగత లేదా సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.వర్క్‌షాప్ ముగింపులో జర్నలిస్టులతో ప్రశ్నోత్తర కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు పి ఐ బి అదనపు డైరెక్టర్ జనరల్ సమాధానాలు ఇచ్చి, వారి సూచనలు మరియు అభిప్రాయాలను సంబంధిత మంత్రిత్వ శాఖలకు చేరవేస్తామని హామీ ఇచ్చారు.

# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**- పటాన్ చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 17 (సమయం న్యూస్):** ఎల్లమ్మ తల్లి చల్లని చూపులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్ గ్రామంలో మాజీ జెడ్పి వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ తన పొలంలో నిర్వహించిన ఎల్లమ్మ కళ్యాణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు కోలన్ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ కోలన్ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉసికెబావి చంద్రారెడ్డి, వరప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# తమ్ముడిపై అపారమైన ప్రేమ.

- చేతుల పై టాటుల తో జ్ఞాపకం.



**రాయపోల్, మార్చి 17:** అన్నదమ్ముల అనుబంధం ఎంత గొప్పదో చాటిచెప్పిన హృదయాన్ని హత్తుకునే ఘటన రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బూరుగుల ఆనందరావు (నందు),తన తమ్ముడు అక్షయ్ రెండు సంవత్సరాల క్రితం మరణించాడు.తమ్ముడి మరణం జీర్ణించుకోలేక అతని జ్ఞాపకాన్ని జీవితాంతం నిలుపుకోవాలని భావించాడు.తమ్ముడిపై ఉన్న అపారమైన ప్రేమను చాటుతూ, ఎడమ చేతిపై అక్షయ్ చిత్రాన్ని పచ్చబొట్టుగా వేయించుకోగా, కుడి చేతిపై అతని పేరును టాటూగా పొడిపించుకున్నాడు. తమ్ముడిని ఎంతగా ప్రేమించాడో ఈ టాటూలే స్పష్టంగా తెలియజేస్తున్నాయి.తమ్ముడి జ్ఞాపకాలను హృదయంలో దాచుకున్న నందు, వాటిని తన శరీరంపై కూడా నిలుపుకోవడం గ్రామస్థులను భావోద్వేగానికి గురిచేసింది. అన్నదమ్ముల మధ్య ఉన్న బంధం ఎప్పటికీ చెదరదని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో తెలంగాణ రాష్ట్ర హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహ



**చేవెళ్ల మార్చి 17(సమయం న్యూస్) :** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆలయ అర్చకులు సాయిశివ, ప్రమోద్, వీరేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి, ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో చండీ హోమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వామి వారి దయతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. పురాతన శివాలయాన్ని దర్శించుకోవడం ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో స్వామికి శివ నామస్మరణ చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మంత్రికి ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు హనుమంతు, ప్రభు స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

# నూతన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు



**కోస్గి మున్సిపల్, మార్చి,17(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నుండి నారాయణపేట జిల్లాకు బదిలీపై వచ్చిన నూతన కలెక్టర్ ప్రతిక్ జైన్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు.

## వేసివికాలం నేపథ్యంలో మంగళవారం తలమడుగు మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో చలి వేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.




పాల్గొన్న తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీఓ శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు.

# జాబ్ మేళా విజయవంతం చేయండి.

**నిజామాబాద్ మార్చి17( సమయం న్యూస్). :** డీఈఈటీ (DEET) సహకారంతో టాస్క్ (౼ూఖ) ప్రాంతీయ కేంద్రం, నిజామాబాద్‌లో జాబ్ మేళా

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (౼ూఖ) వారు డీఈఈటీ (ఆజుజు) సహకారంతో 2026 మార్చి 18న నిజామాబాద్‌లోని టాస్క్ ప్రాంతీయ కేంద్రం, ఐటీ టవర్స్ లో ఒక మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు.

ఈ ఇంటర్వ్యూలు ఉదయం 10:30 గంటల నుంచి ఐటీ టవర్స్, గ్రౌండ్ ఫ్లోర్, నిజామాబాద్ లో ప్రారంభమవుతాయి.

**పాల్గొనే కంపెనీలు:** బ్రియో టెక్నాలజీస్, డెవ్లాట్స్, వరుణ్ మోటార్స్, విన్‌గిగ్, జస్ట్‌డయల్, డిజిట్యూడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సాగిలిటీ, ధరారే గ్లోబల్ సొల్యూషన్స్, వైఎస్కే ఇన్ఫోటెక్.

**అర్హతలు:** 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా మరియు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చు.

ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాలలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

శ్రీ సవీన్ రెడ్డి, ప్రాంతీయ కేంద్రాధిపతి, టాస్క్ మరియు రఘు తేజా, జిల్లా మేనేజర్, టాస్క్, నిజామాబాద్ గారు అర్హత గల అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తాగునీటి వృథా.. ఒకరికి ఫైన్..!



**హైదరాబాద్ మార్చి17( సమయం న్యూస్). :** జలమండలి సరఫరా చేసే తాగునీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ప్రజల నుండి వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా వచ్చిన సమాచారం మేరకు, నివాస, వాణిజ్య ప్రాంగణాల్లో ఫ్లోర్లు, సెల్లార్లు, ఓపెన్ ఏరియాలను కడగడానికి త్రాగునీటిని వినియోగిస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయి.మంగళ వారం అధికారులకు వాట్సాప్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు, జూబ్లీహిల్స్‌లోని నివాసం ఉంటున్న దాసరి తనూజ రెడ్డి పేరుతో ఉన్న (జూచీ చీశీ. 061108578) ఇంటివద్ద ఫ్లోర్ ను కడుతూ నీటిని దుర్వినియోగం చేసినట్లు స్థానిక అధికారులు గుర్తించారు.దీంతో జలమండలి నిబంధనలు ఉల్లంఘించినందుకు వారికి రూ.5000 ఫైన్ వేశారు. ఎవరైనా ఇలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ నేపథ్యంలో, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు బోర్డు తెలిపింది. జలమండలికి తాగునీటి వృథాపై ఫిర్యాదులు అందుతున్నాయి. కస్టమర్ కేర్ కు ఫోన్ చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో నేరుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు.దీంతో జీఎంలు తమ పరిధిలో.. తాగునీరు సరఫరా చేసే సమయంలో తమ సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేయిస్తున్నారు. ఎవరైనా తాగునీరు వృథా చేసినట్లు గమనిస్తే.. వెంటనే నోటీసులు జారీ చేసి జరిమానా విధిస్తున్నారు. త్రాగునీటి దుర్వినియోగంపై ఫిర్యాదులు చేయాలనుకునే వారు వాట్సాప్ నంబర్ o91 99499 30003 లేదా మెట్రో కస్టమర్ కేర్ 155313 ద్వారా సమాచారం అందించవచ్చు.

## TGSRTC -- పరిగి డిపో ప్రత్యేక పుణ్యక్షేత్రల యాత్ర

● వికారాబాద్ జిల్లా పరిగి బస్ డిపో మేనేజర్ కె. కృష్ణమూర్తి



**పరిగి,మున్సిపల్, మార్చి,17(సమయం న్యూస్) :** 25.03.2026మూడు జ్యోతిర్లింగాలు (కాశి, ఓంకారేశ్వర్, మహాకాళేశ్వర్) మరియు బాసర, ప్రయాగరాజ్, అయోధ్య, లి దర్శనాల కోసం లి7 రోజులు టూర్ ప్యాకేజీని తీసుకురావడం జరిగింది. ప్రయాణ తేదీ / సమయం: పరిగి నుండి యాత్ర ప్రారంభం లి25.03.2026. బుధ వారం ఉదయం 9.00 గంటలకు: సూపర్ లగ్జరీ (36 సీటర్ )సీట్: 2o2

**యాత్ర ముగింపు :** పరిగి చేరుకునే తేది /సమయం: 31.03.2026 మంగళవారం రాత్రి 11:00 గంటలకు ముగుస్తుంది.

**దర్శించు పుణ్యక్షేత్రాలు:**

. 1.బాసర (శ్రీ జ్ఞాన సరస్వతి దేవి దర్శనం)
2.ప్రయాగ్రాజ్ -- త్రివేణి సంగమం (ఉత్తర ప్రదేశ్)
3.కాశి -- వారణాశి (ఉత్తర ప్రదేశ్)
4.అయోధ్య -- (ఉత్తరప్రదేశ్)
5.ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగం ( మధ్యప్రదేశ్ )
6.మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం( మధ్యప్రదేశ్ )

టూర్ ఛార్జీలు:
ఒక్కొక్కరికి కేవలం ₹7,600/- మాత్రమే
భోజనాల ఖర్చులు మీరే పెట్టుకోవాలి
అడ్వాన్స్ బుకింగ్ కోసం సంప్రదించండి: ఫోన్ నంబర్. 75690 65644
ఈ పవిత్ర పుణ్యయాత్రలో పాల్గొని
దేవుని అనుగ్రహానికి పాత్రులు కావాలని
డిపో మేనేజర్ కె. కృష్ణమూర్తి
పరిగి పట్టణ ప్రజలను హృదయపూర్వకంగా కోరుతున్నారు.పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల మార్చి 17,,( సమయం న్యూస్). :** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ తో కలిసి సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఎండాకాలం దృష్ట్యా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వెంకట్రావుపేట, దౌడపల్లి, చందారం గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా పట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. గృహాలు, వ్యాపార సముదాయాల వద్ద చెత్తను రోడ్లపై, మురుగు కాలువలలో వేయకూడదని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ పథకం నీటి ట్యాంకుల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్ తో కలిసి పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రానున్న వేసవిలో ప్రజలకు నిరంతరంగా నీటిని అందించే విధంగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం డివిజన్‌లో కాలనీల సమస్యలు పరిష్కరించాలి

- సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



**జిన్నారం,మార్చి 17,(సమయం న్యూస్):** బొల్లారం డివిజన్ పరిధిలోని బీసీ కాలనీ, పాతబస్తీ (ఎస్సి కాలనీ), బీరప్ప బస్తీ, మల్లన్న బస్తీ మరియు గాంధీ నగర్ కాలనీలలో మౌలిక వసతుల లేమితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్‌ను అమీన్పూర్ సర్కిల్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వి. చంద్రారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ 1983లో ఏర్పడిన బీసీ కాలనీ నేటికీ అభివృద్ధికి నోచుకోక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో లోకాయుక్తకు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితుల్లో మార్పు రాలేదని విమర్శించారు.పాతబస్తీలో ఎల్లమ్మ--పోచమ్మ ఆలయాల సమీపంలో డ్రైనేజీ నీరు పొర్లిపోవడంతో ప్రజలు నడవలేని పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గాంధీ నగర్ కాలనీలో డంప్ యార్డ్ కారణంగా ఈగలు, దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ ఐదు కాలనీల్లో తక్షణమే సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని నాయకులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్‌సీ పురం కార్పొరేటర్ పుష్ప నగేష్, ఆత్మ కమిటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, రాజ్ గోపాల్, వెంకటయ్య, యువజన నాయకుడు అబ్దుల్ బషీర్, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలు ఎక్కడ?

రైతులకు న్యాయం చేయాలి!
తాసిల్దార్‌కు బీజేపీ వినతి.
ప్రభుత్వంపై మంకిడి స్వామి ఫైర్.



**రాయపోల్, మార్చి 17:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు మంగళవారం రాయపోల్ మండల తాసిల్దార్ కృష్ణ మోహన్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు మంకిడి స్వామి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినప్పటికీ,వాటి అమలులో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు.రైతుబంధు పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయిందని, రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందన్నారు.ముఖ్యంగా రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్క రైతుకూ పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని స్పష్టం చేశారు.పొద్దుతిరుగుడు పంటలు కోసి రైతులు రోడ్ల వెంట, కల్లాలల్లో కుప్పలు పోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్నా, ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో పాటు రైతులకు హామీ ఇచ్చినట్లుగా రెండు లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను రోడ్లపైకి తీసుకువచ్చి బీజేపీ తరపున భారీ స్థాయిలో నిరసనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు స్వామి,. ప్రధాన కార్యదర్శి గణేష్,. సీనియర్ నాయకులు వెంకట్ గౌడ్,ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు సత్యం,భూత్ అధ్యక్షులు కరుణాకర్,నాయకులు చెవుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## నక్ష బాటలో అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

- విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ హామీ

**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 17(సమయం న్యూస్):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని మంగంపేట గ్రామంలో నక్ష బాటలో అక్రమంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయని మండల తహసిల్దార్ దేవదాస్, మున్సిపాలిటీ కమిషనర్ తిరుపతికి లిఖితపూర్వకంగా మంగంపేట నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు అధికారులకు వివరాలు అందజేస్తూ సంబంధిత నక్ష బాటలో గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా రహదారి నిర్మాణ పనులు కూడా నిర్వహించినట్లు తెలిపారు.అయినప్పటికీ అదే ప్రదేశంలో ప్రస్తుతం అక్రమంగా గృహ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు.ఈ విషయంపై తక్షణమే విచారణ నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన మండల తహసిల్దార్ దేవదాస్, ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంగంపేట నాయకులు నరేందర్,రవి, శ్రీకాంత్, రతన్ తదితరులు పాల్గొన్నారు.ం

## పేట నూతన కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన మద్దూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూరు మున్సిపల్, మార్చి,17(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా నుండి నారాయణపేట జిల్లా కు బదిలీపై వచ్చిన నూతన కలెక్టర్ ప్రతిక్ జైన్ ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన మద్దూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్.



## మహిళా సంఘాలకు భవనం నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ కు మహిళా సంఘాల వినతి

**పటాన్ చెరు (గుమ్మడిదల), మార్చి 17 (సమయం న్యూస్):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘాల కార్యకలాపాల కోసం ప్రత్యేక భవనం నిర్మించాలని కోరుతూ మహిళా సంఘాల ప్రతినిధులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గుమ్మడిదల పరిధిలో మొత్తం 164 మహిళా సంఘాలు ఉన్నాయని, సుమారు 1640 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారని తెలిపారు. ప్రస్తుతం సంఘాలకు స్వంత భవనం లేకపోవడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాల అమలు, మహిళల ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలంటే ప్రత్యేక భవనం అవసరమని వారు స్పష్టం చేశారు. భవనం నిర్మాణం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలు విస్తృతంగా నిర్వహించుకునే అవకాశం లభిస్తుందని, శిక్షణా కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాల అభివృద్ధికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కత్తుల రమేష్, అబిశెట్టి రాజశేఖర్, సురభి కుమార్ గౌడ్, నాయకులు తుపాకుల రాజు, హుస్సేన్, మహిళా సంఘాల మహిళలు బుచ్చమ్మ, బి. లక్ష్మి, అమృత, స్వప్న, నాజియా, పీ. లక్ష్మీ పాల్గొన్నారు.

## రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు



**పటాన్ చెరు (గుమ్మడిదల), మార్చి 17,(సమయం న్యూస్):** యాసంగి 2025-26 రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి. శ్రీనివాసరావు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28.02.2026 తేదీ వరకుకొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన మరియు డిజిటల్ సైన్ అయిన రైతులు, అలాగే ఇప్పటివరకు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.దరఖాస్తు చేసుకునే రైతులు పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ ప్రతులను రైతు భరోసా దరఖాస్తు ఫారానికి జతపరచి తమ గ్రామ వ్యవసాయ విస్తరణాధికారికు సమర్పించాలని తెలిపారు.అలాగే, బ్యాంక్ ఖాతా వివరాలలో మార్పులు చేయాలనుకునే రైతులు వెంటనే తమ గ్రామ ఏఈఓను సంప్రదించి వివరాలు ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే రైతు భరోసా లబ్ధి పొందుతున్న రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.మరిన్ని వివరాల కోసం రైతులు తమ గ్రామ ఏఈఓ లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని ఆయన కోరారు.

# విద్యార్థుల ఆహారపు అలవాట్లపై ఫుడ్ ఫెస్టివల్ అభినందనీయం

**- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి. చంద్రారెడ్డి**




**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 17 (సమయం న్యూస్):** విద్యార్థులకు చదువుతోపాటు ఆహారపు అలవాట్లపై అవగాహన పెంపొందించేందుకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వి. చంద్రారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం బొల్లారం డివిజన్ పరిధిలోని మల్లన్న బస్తీలో ఉన్న శ్రీ వాగ్దేవి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో పోషకాహారం పై అవగాహన కల్పించడంతో పాటు, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఫుడ్ ఫెస్టివల్ అద్భుతమైన వేదికగా నిలుస్తుందని అన్నారు.జంక్ ఫుడ్ వల్ల కలిగే నష్టాలు, వివిధ ఆహార పదార్థాల్లో ఉండే విటమిన్ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం మంచి పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఇంటి వద్ద తయారుచేసి తీసుకువచ్చిన వివిధ వంటకాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన నాయకులను పాఠశాల డైరెక్టర్ ఉదయ్ భాస్కర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకులు వి. వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎం.పీ.టీ.సీ కృష్ణంరాజు, స్థానిక నాయకులు వెంకటయ్య, యువజన నాయకులు అబ్దుల్ బషీర్, మాజీ వార్డు సభ్యుడు భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు

- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి
- ఖాజిపల్లి ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్ చెరు (జిన్నారం), మార్చి 17 (సమయం న్యూస్):** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు బాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్,గద్దె నరసింహ, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# జాతీయ గీతం వివాదం..

- ఎంఐఎం ఎమ్మెల్యేలపై బీజేపీ మండలాధ్యక్షుడి విమర్శలు.

రాయపోల్, మార్చి 17:రాష్ట్ర అసెంబ్లీలో మొదటి రోజు జాతీయ గీతం వందేమాతరం ఆలపిస్తుండగా ఎంఐఎం ఎమ్మెల్యేలు సభ నుండి బయటకు వెళ్లడం చర్చనీయంగా మారింది. ముస్లిం మైనార్టీ ఎమ్మెల్యేలు,. అసెంబ్లీ సభా నిబంధనలు ఉల్లంఘించి జాతీయ గీతాన్ని అవమానించారని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండలాధ్యక్షుడు మంకిడి స్వామి ఆరోపించారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ, సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న సమయంలో ఆల్ ఇండియా మజ్లిస్-ఇ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) ఎమ్మెల్యేలు సభ నుంచి బయటకు వెళ్లారని పేర్కొన్నారు.ఇది జాతీయ గౌరవాన్ని దెబ్బతీసే చర్యగా ఆయన విమర్శించారు.ఎంఐఎం పార్టీ ఎంఎల్ఏ లు ఈ దేశ ప్రజల ఓట్లతో గెలుపొందుతూ,దేశ జాతీయ గీతాన్ని అవమానించడం బాధాకరమన్నారు. భారతదేశంలో ఉంటూ దేశ వనరులను వినియోగించుకుంటూ జాతీయ చిహ్నాలను,జాతీయ గీతాన్ని గౌరవించకపోవడం సమంజసం కాదన్నారు.రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంఐఎం నేతలకు తగిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.సభా హక్కులను ఉల్లంఘించిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై వెంటనే స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కొంగరి స్వామి,ప్రధాన కార్యదర్శి గణేష్, సీనియర్ నాయకులు వెంకట్ గౌడ్,ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు సత్యం,బూతు అధ్యక్షులు కర్ణాకర్,నాయకులు చెవుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడా పాఠశాల లో) ప్రవేశానికి షెడ్యూల్

- తెలంగాణ ప్రభుత్వము జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం వికారాబాద్



**వికారాబాద్, మార్చి,17(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వముజిల్లా గిరిజన అభివృద్ధి అధికారి గారి కార్యాలయం, వికారాబాద్ జిల్లా.వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాల లో )ప్రవేశానికి షెడ్యూల్ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్య సంవత్సరానికి ఆశ్రమ ఉన్నత పాఠశాల బోయినపల్లి నందు కాయకింగ్, కేనోయింగ్, సేయి-లింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్ నందు గిరిజన బాల బాలికలకు ప్రతిభ ఆధారంగా 5వ తరగతి లో ఇంగ్లీష్ మీడియం నందు 10 మంది బాలికలకు 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పాఠశాల లో ప్రవేశానికి గాను ఐ టి డి ఏ మైదాన ప్రాంత జిల్లాలకు (ITDA Plain Area) సంబందించిన బాలబాలికలు అర్హులు ఈ వాటర్ స్పోర్ట్స్ పాఠశాల లో శిక్షణ పొందు బాల బాలిక లకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, షూస్ మరియు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు 4వ తరగతి ఉతీర్ణులై రెండు (2)పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు జీరాక్స్ సర్టిఫికెట్స్ తో తేది 23.03.2026 వరకు ఈ క్రింద పేర్కొన సమీప కార్యాలయం నందు నీర్ణిత సమయం లో దరఖాస్తు చేసుకొనవలెను. క్ర.సం ఎంపిక స్థలము ఇన్ ఛార్జ్ అధికారి ఫోన్ నెంబర్

1 గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, మర్పల్లి టి.కుమార్ 95429720942

గిరిజన బాలుర ఆశ్రమ పరశాల, కుల్కచెర్ల ఆర్. రాజేందర్ 9959293604

జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి వికారాబాద్ జిల్లా

# వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు



**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 17 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని జాలిగామ బైపాస్ రోడ్డులో గల వక్ఫ్ బోర్డ్ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నాయి మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వదిలివేస్తున్నారు ఇట్టి నిర్మాణాలపై కలెక్టర్ దృష్టిసాగించగలరని పలువురు కోరుతున్నారు

# పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం



**ఖమ్మం , మార్చి 17 :( సమయం న్యూస్ ) :** పెనుబల్లి మండలం లోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ.ఎఫ్.ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు. అలాగే నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# దోమల నివారణ చర్యలు

- చేపట్టిన సబ్ యూనిట్ అధికారి ఎస్. పకిరప్ప
- జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్.స్వర్ణ కుమారి,
- మరియు జిల్లా కిటక జనిత వ్యాధుల నివారణ అధికారి
- డాక్టర్. రవీంద్ర యాదవ్ ఆదేశానుసారం






**కొడంగల్ మండలం, మార్చి,17(సమయం న్యూస్) :** కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామ శివారులో గల తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ బి రాందాస్ ని కలిసి వారి పర్యవేక్షణలో కొడంగల్ సబ్ యూనిట్ అధికారి ఎస్ పకిరప్ప పాఠశాలలోని అన్ని గదులు మరియు బాత్ రూమ్స్ లలో దోమల నివారణ మందు ఏసీఎం (ూశ్రీజూష్ట్ఖు జఎజూవతీ వీవ్ఞ్రతీఱఅవ) 5% పిచికారి చేయించడం జరిగింది. అనంతరం విద్యార్థులకు మరియు సిబ్బందికి దోమల పుట్టుక, దోమల వల్ల కలిగే వ్యాధులు, వాటి నివారణ చర్యలు, వక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం జరిగింది, ఇట్టి కార్యక్రమములో మధుసూదన్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్, రేష్మా జూనియర్ వైస్ ప్రిన్సిపాల్, మేరీ జోన్స్ మేడం పీఇటీ ఉన్నారు."

# ఇందిరమ్మ కాలనీలో ఇఫ్తార్ , రంజాన్ కిట్ల పంపిణీ



**ఖమ్మం , మార్చి 17 :( సమయం న్యూస్ ) :** ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ముస్లిం మైనార్టీ సోదరులకు ప్రభుత్వం ప్రభుత్వం తరఫునరంజాన్ పండుగ ను పురస్కరించుకొని బట్టల తో పాటు రంజాన్ కి ట్ల పంపిణీ తో పాటుఇఫ్తార్ విందు ను ఎదులాపురం మున్సిపాలిటీ లోని8వ వార్డులో గల మజీద్ ఏ ఫాతిమా ఇందిరమ్మ కాలనీ ఫేస్ -1 లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా మద్దెల పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు , 8వ వార్డు కౌన్సిలర్ సంఘాని సుశీల , 13 వార్డు కౌన్సిలర్ బైరు కోటేశ్వరరావు9వ వార్డు కౌన్సిలర్కం దుకూరి వెంకటనారాయణ ,సంఘాని వెంకటేశ్వర్లు , కాంగ్రెస్ పార్టీనాయకులు చిన్న నాయుడు , పాలేరు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఇంచార్జ్ షేక్ .నజీరుద్దీన్ , మజీద్ అధ్యక్షులు షేక్ .రషీద్ , షేక్. హుస్సేన్‌షేక్. ముబారక్, షేక్ .ముక్రం , షేక్ .బాబాకాలనీవాసులు, పార్టీ శ్రేణులుపాల్గొన్నారు.

# ఎమ్మార్వో కు బిజెపి వన్ టౌన్ నాయకుల వినతి



**ఖమ్మం మార్చి 17 : ( సమయం న్యూస్ ) :** భారతీయ జనతా పార్టీ ఖమ్మం వన్ టౌన్ నాయకులు మంగళవారం ఖమ్మం అర్బన్ తాసిల్దార్ కు పలు విషయాలపై ఫిర్యాదు చేస్తూవినతి పత్రానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వన్ టౌన్ అధ్యక్షులుగడిలనరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తుంగలో తొక్కి 420 హామీలను ఇచ్చి ,యావత్ తెలంగాణప్రజానీకాన్ని మోసం చేస్తుందని ఆరోపించారు. ఈరోజు వరకు కూడా ఏ ఒక్క హామీల నెరవేర్చక కుండా రైతులను, విద్యార్థులను, మహిళలను, వికలాంగులను ప్రతి ఒక్కరిని ఓట్ల కోసమేద గా చేసిందన్నారు. మండల రెవెన్యూ అధికారిగా సర్టిఫికెట్స్ జారీ చేసే విషయం లో , సంక్షేమ పథకాలను ఆందించే విషయంలో పారదర్శకంగా అర్హులకు అందేవిధంగా చుడాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా, జిల్లా నాయకులు కోటమర్తి సుదర్శన్,బండ్ల రిగాన్ ప్రతాప్, మండల నాయకులు పాలేపు రాము, తుమ్మ ఇందు, బాలి బిందు, మేడ సంపత్, మరిమెల్ల రామకృష్ణ, లు పాల్గొన్నారు

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 17: (సమయం న్యూస్ ) :** మున్సిపాలిటీ పరిధిలోని 15 డ 16వ వార్డుల్లో నిర్వహిస్తున్న "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల" కార్యక్రమంలో చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సమస్యలను పరిశీలించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి , శైలజ ఆగి రెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు,,అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# ఐక్య సంఘం ఆధ్వర్యంలో 16 లక్షల రూపాయల విలువైన రంజాన్ తోఫా

- సహాయం చేయడం ద్వారానే పండుగ పరమార్ధం సిద్ధిస్తుంది
- మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం



**ఖమ్మం , మార్చి 17 : ( సమయం న్యూస్ ) :** పేదలకు సహాయం చేయడం ద్వారానే పండుగ పరమార్థం సిద్ధిస్తుందని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం అందించిన తోఫా ను మున్సిపల్ చైర్మన్ సుజాత రామనాథం,ఆ సంఘం నేతలు మౌలానా షేక్ ముజాహిద్,షేక్ హుస్సేన్ సాహెబ్ లతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సుజాత రామనాథం మాట్లాడుతూ,పేదల ఆకలిని గుర్తించిన తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్ ముజాహిద్ , రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ లు సంఘం ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ సందర్భంగా మధిర నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల రెండు వందల ముస్లిం కుటుంబాలకు 16 లక్షల రూపాయల విలువైన నిత్యవసర ఆహార పదార్థాలతో కూడిన కిట్టు (రంజాన్ తోఫా)అందజేయటం అభినందనీయమని అన్నారు.పవిత్ర రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి ఒక అద్భుతమైన మార్గమని, ఉపవాస దీక్షలు మనిషిలో ఆధ్యాత్మిక చింతనను, సహనాన్ని రెట్టింపు చేస్తాయని తెలిపారు.పేదల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ఆనందాన్నిస్తుంది , సంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేదలకు సహాయం చేయాలనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని,పేదల కోసం ఖర్చు పెట్టే ప్రతి పైసా ఆనందాన్నిస్తుంది అని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నేతలు మౌలానా షేక్ ముజాహిద్,షేక్ హుస్సేన్ సాహెబ్ అన్నారు.ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా బియ్యం,గోధుమ పిండి,సేమియా, పంచదార,జీడిపప్పు, కిస్మిస్,ఖర్జూరం,నెయ్యి, బిర్యానీ మసాలా,బన్ కేక్,తదితర నిత్యవసర సరుకులతో కూడిన కిట్టును అందించటం సంతోషంగా ఉందన్నారు.గత మూడేళ్ల నుంచి ఎవరి సిఫారసు ఎవరి ప్రమేయం లేకుండానే నిరుపేదలను గుర్తించి సహాయం అందిస్తున్నామని తెలిపారు.అల్లా కృపతో భవిష్యత్తులో మరిన్ని పేద కుటుంబాలకు విద్యా, వైద్యం అందించేందుకు తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం కృషి చేస్తుందన్నారు.

# ఎన్ ఎస్. ఎస్ జాతీయ సమైక్యతా శిబిరం వివిధ సంస్కృతుల సమ్మేళనానికి వేదిక

- ఒకే శిబిరంలో అధ్యాపకుడు మరియు విద్యార్థి పాల్గొనడం తమకు గర్వకారణం
- కొడంగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, మార్చి,17(సమయం న్యూస్) :**ఇటీవల కర్ణాటక రాష్ట్రం, ఆదికవి శ్రీ మహర్షి వాల్మీకి విశ్వ విద్యాలయం, రాయచూరులో జరిగిన ఎన్. ఎస్. ఎస్ జాతీయ సమగ్రతా శిబిరంలో వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ డా. ఇస్లావత్ సోమ్లా కంటింజెంట్ అధికారిగా మరియు విద్యార్థి ఐ. ప్రవీణ్ కూడా పాల్గొన్నట్లు, ఒకే శిబిరంలో అధ్యాపకుడు మరియు విద్యార్థి పాల్గొనడం తమకు గర్వకారణమని ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు ఎన్ ఎస్. ఎస్ జాతీయ సమైక్యతా శిబిరం వివిధ సంస్కృతుల సమ్మేళనానికి చక్కని వేదిక అని ఇటువంటి శిబిరాల వల్ల భాషా సంస్కృతుల సమ్మేళనం జరిగి విద్యార్థులలో దేశ భక్తిని, జాతీయ సమైక్య తను పెంపొందింపజేసి తద్వారా దేశ సమగ్రతకు తోడ్పడుతాయన్నారు. ఈ శిబిరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు మరియు కేరళ రాష్ట్రాలకు చెందిన ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ శిబిరంలో వివిధ రాష్ట్రాల ఆటలు, జానపద కళారూపాల ప్రదర్శన, వక్తృత్వం, వ్యాసరచన, ఏకపాత్రాభినయనం వంటి పోటీల నిర్వహణ జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో డా. ఇ. సోమ్లాకు కంటింజెంట్ అధికారులకు నిర్వహించిన 5కె రన్ లో మొదటి బహుమతి లభించగా దానిని రాయచూరు జిల్లా ఎస్. పి శాంతివీర్ చేతుల మీదుగా అందుకున్నారు. అదే విధంగా కళాశాలకు చెందిన విద్యార్థి ఐ. ప్రవీణ్ జానపద గానంలో తృతీయ బహుమతి పొందాడు. పాలమూరు విశ్వ విద్యాలయం విద్యార్థులు బోనాలు నృత్య ప్రదర్శనతో అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎన్. ఎస్. ఎస్ అధికారి డా. ఇ. సోమ్లా మరియు విద్యార్థి ప్రవీణ్ ను పి. యు వైస్ ఛాన్స్ లర్ ఆచార్య జి. యన్. శ్రీనివాస్, ఎన్. ఎస్. ఎస్ కోఆర్డినేటర్ డా. కె. ప్రవీణ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థులు అభినందించారు.

# చేవెళ్లలో ఇఫ్తార్ విందు

- ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు



**చేవెళ్ల మార్చి 17 (సమయం న్యూస్) :** నవాబుపేట్ మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో ప్రభుత్వం తరఫున మైనార్టీ సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మైనార్టీ సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేసి, రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.రంజాన్ కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య , మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మైనార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసుల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం

- గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం.
- డాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరిండెండెంట్.



**సమయం న్యూస్ గజ్వేల్ మార్చి 17 :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మంగళవారం పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక "99 రోజుల' కార్యాచరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 63 మంది పోలీసు సిబ్బందికి ఈ శిబిరంలో సుమారు 59 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రాత్రి పగలు తేడా లేకుండా, సొంత ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా శాంతిభద్రతల పరిరక్షణ కోసం శ్రమిస్తున్న పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజ శ్రేయస్సు, ప్రజల రక్షణ సాధ్యమవుతుంది. విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. ఈ వైద్య శిబిరంలో పోలీసులకు రక్తపోటు, మధుమేహం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసీపీ నరసింహులు, సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి, ఆసుపత్రి ఆర్.ఎం.ఓ డాక్టర్ రాము, డాక్టర్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్లు దొడ్డి రమేష్, జీవన, రచన, శ్రీను, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కేసులని డిస్పోజల్ చేయట్లేదని ఆవేదన

- సీనియర్ సివిల్ విద్య నాయక్.
- రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుంది- న్యాయమూర్తి





**నారాయణపేట, మార్చి,17(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చ్ 28న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ ఉద్దేశించి పోలీస్ ఆఫీసర్స్ తో సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడుతూ.. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు.వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు నారాయణపేట టౌన్ మరియు రూలర్,మాగనూరు, మద్దూరు, దామరగిద్ద, ఉట్కూర్, కోస్గి, ధన్వాడ, మక్తల్, కృష్ణ, నర్వ, మరియు మరికల్, ఎక్సైజ్ ఇతర స్టేషన్ లలో ఈపెట్టి, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెండింగ్లో ఉన్నాయని టార్గెట్ గా ఉన్నాయని తెలిపారు. ఎక్సయిజ్ శాఖలో పెండింగ్ కేసులు ఉన్నాయా క్లియర్ చేయాలన్నారు. అన్ని కలిపి 6000 కేసులను ఇచ్చిన టార్గెట్ ను కేసులని డిస్పోజల్ చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు, త్వరగా పెండింగ్లో ఉన్న కేసులని ఈ లోక్ అదాలత్ చర్యలు తీసుకొని కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలను క్రిమినల్ కాంపౌండ్డబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్,కేసులను, చీ× ఆక్ట్ పెండింగ్ లో ఉన్నాయా చర్చించారు పెండింగ్లో ఉన్న ప్రతి ఒక్క కేసు ఈ లోక దాతలు డిస్పోసల్ చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.తదుపరి లీగల్ సర్వీసెస్ సంస్థ నుంచి మంత్లీ మానిటరింగ్ కమిటీ మీటింగ్ జరిపించి న్యాయమూర్తి మాట్లాడుతూ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ కే లక్ష్మీపతి గౌడ్ మరియు పార లీగల్ వాలంటీర్స్ లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ గురించి జిల్లాలో ఉన్న ప్రతి గ్రామాల్లో లోక్ అదాలత్ యొక్క ఉచిత సేవలు, ఉచిత న్యాయం , టోల్ ఫ్రీ 15100 గురించి అవేర్నెస్ చేయాలని లీగల్ సర్వీసెస్ కార్యదర్శి విద్యా నాయక్ ఆదేశించారు.ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్,ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే అవినాష్, సెకండ్ క్లాస్ కోర్ట్ న్యాయమూర్తి,డిఫెన్స్ కౌన్సిల్స్ కె లక్ష్మి పతి గౌడ్, మరియు పోలీస్ అధికారులు, కోర్ట్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకం మోనును వంద శాతం అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.





**నారాయణపేట, మార్చి, 17(సమయం న్యూస్) :** జిల్లాలోని అన్ని ప్ర భుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల వసతి గృహాలలో మధ్యాహ్న భోజన పథకం మోను ను కచ్చితంగా వం ద శాతం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యం, ఇతర వంట సరకులు పూర్తి స్థాయిలో నాణ్యతతో కూడినవి వినియోగించాలన్నారు. జిల్లా అధికారులతో తీసుకుంటున్న తొలి సమావేశం విద్య పైనే అని.. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజనం మరియు డైట్ ప్లాన్ అమలుపై కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి మంగళ వారం సాయంత్రం ఆయన జిల్లా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 17 నుంచి 21 లోపు వారికి నోడల్ అధికారులు/మండల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టల్ ల పర్యవేక్షణ చేసి, విజిట్ రిపోర్ట్ ను తప్పనిసరిగా గూగుల్ ఫార్మ్ లో నివేదిక పంపించాలని సూచించారు. దీనిని అత్యంత ప్రాధాన్యతగా భావించి కేటాయించిన గడువులోపు విజిట్ లను పూర్తి చేయాలన్నారు. ఇకపై మండలానికి ఒక తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, ఎస్. ఐ తో కూడిన అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, ఆ కమిటీ వారం లో రెండుసార్లు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి అక్కడి మౌలిక వసతి సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఆయా పాఠశాలలు,వసతి గృహాల విద్యార్థులతో కలిసి వారంలో కచ్చితంగా రెండుసార్లు మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత, రుచిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో కొన్ని పాఠశాలలకు ప్రహరీలు సరిగ్గా లేవని, అసాంఘిక కార్య కలాపాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రహరీలు లేని పాఠశాలల జాబితా తయారు చేసి ఇవ్వాలన్నారు. వసతి గృహాల లోపలికి ఎవ్వరిని అనుమతించరాదని మరీ ముఖ్యంగా బాలికల వసతి గృహాల లోపలికి ఎవ్వరిని అనుమతించ వద్దని తేల్చి చెప్పారు. అవసరమైతే బాలికల వసతి గృహాల బయట లోపలికి వెళ్లడానికి ఎవరికి అనుమతి లేదనే ఫ్లెక్సీలు పెట్టాలని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రోటోకాల్ తప్పని సరిగా పాటించాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్ బీ ఎస్ కే బృందాలు క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఎక్కడెక్కడ శిబిరాలు నిర్వహించారో నివేదిక తీసుకోవాలని వైద్య శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలను సజావుగా కొనసాగించాలని, పరీక్షా కేంద్రాల లోపలికి ఇన్విజిలేటర్లు ఎవ్వరూ సెల్ ఫోన్లు తీసుకు వెళ్లరాదని, కేంద్రాల్లోకి సెల్ ఫోన్ల అనుమతి లేదన్నారు. అనంతరం ఆయన పలువురు ఎంపీడీవోలు, హెచ్ డబ్ల్యుఓలు, ఎంఈవోలు, ఎంపివో లతో వారి వారి పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల సంఖ్య, అవసరమైన వసతులు, ఇతర సౌకర్యాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఈఓ గోవింద రాజులు, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ/ ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎం. ఏ. రషీద్, పౌర సరఫరాల శాఖ అధికారి బాల్ రాజ్, జీసీడీవో సంగీత, ఏ ఎం వో విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.




# భగత్ సింగ్, రాజ్గురు, సుఖదేవ్ల స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి
- బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ.

**చేవెళ్ల మార్చి 17 (సమయం న్యూస్) :** . మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జరిగింది. విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95 వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎస్ఐ, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం పోరాడిన భగత్ సింగ్ త్యాగం భారత యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా రంగంపై దాడులు, ప్రజాస్వామ్య హక్కుల పై జరుగుతున్న దాడుల నేపథ్యంలో భగత్సింగ్ ఆలోచనలు నేడు మరింత ఆవశ్యకంగా మారాయని వారు తెలిపారు. యువత సమాజ మార్పు కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని పట్టి పీడుస్తున్న గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్తో యువత ఫెడధోరణులు పడుతున్నారనీ వాటికి వ్యతిరేకంగా విద్యార్థి, యువత నడుం బిగించాలనిసూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన ర్యాలీలు, డ్రగ్స్, గంజాయి, బెట్టింగ్ యాప్స్ వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, సహాయ కార్యదర్శి మాల చందు, చరణ్, నితీష్, అరుణ్, రోషన్ , విద్యార్థులు పాల్గొన్నారు.



# మాల్దీవ్స్ టు నెట్స్

## ఐపీఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం..!

**ముంబై:** పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్ లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెడీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు. మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.





# మానసికంగా కుంగిపోయా!

- విజయాల కంటే పరాజయాలే ఎక్కువ
- వరల్డ్ కప్ నా చిన్ననాటి కల
- ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డా
- సంజు భావోద్వేగ వ్యాఖ్యలు!

**ఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తన కెరీర్, లక్ష్యాల గురించి భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించడం తన చిన్ననాటి కల అని, దాన్ని నిజం చేసుకోవడానికి ఎన్నో సంవత్సరాలు కృషి చేశానని తెలిపాడు. వరల్డ్ కప్ లక్ష్యాన్ని సాధించాలనే కోరిక తన మనసులో ఎప్పుడూ ఉండేదని, దాన్ని ప్రతిరోజూ ఊహించుకుంటూ ధ్యానం చేసేవాడినని వెల్లడించాడు. తన క్రికెట్ ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయని పేర్కొన్నాడు. కెరీర్‌లో విజయాల కంటే పరాజయాలే ఎక్కువ అని, ఓ సమయంలో మానసికంగా కుంగిపోయా అని సంజు చెప్పుకొచ్చాడు. తాజాగా సంజు శాంసన్ మాట్లాడుతూ... '2019లో ఐదు సంవత్సరాల గ్యాప్ తర్వాత తిరిగి జట్టులోకి వచ్చా. ఆ సమయంలో కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ నాతో మాట్లాడాడు. జట్టులోకి వచ్చాక నీ లక్ష్యం ఏంటి? అని అడిగాడు. నేను ఎలాంటి సందేహం లేకుండా భారత్‌కు వరల్డ్ కప్ అందించడమే నా టార్గెట్ అని చెప్పా. అప్పటి నుంచి 2026 వరకూ అదే లక్ష్యంతో కృషి చేశా. నా ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయి. చిన్నప్పటి నుంచి ఎన్నోసార్లు కిందికి పడిపోయా. విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా చూశా. అందుకే వైఫల్యాలను ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. అదే నా బలం'అని వివరించాడు. 'వరల్డ్ కప్ 2026 ముందు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో విఫలమయ్యా. ఆ సమయంలో నేను మానసికంగా కుంగిపోయా. కానీ నాలుగు ఐదు రోజుల్లోనే తిరిగి లేచి నిలబడగలిగా. నాలో ఉన్న పట్టుదలే మళ్లీ విజయాల దిశగా నడిపించింది. చివరకు భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించాలనే కల నెరవేరింది. నా జీవితంలో చివరి శ్వాస వరకు ఇది గుర్తుంటుంది' అని సంజు శాంసన్ భావోద్వేగంగా వెల్లడించాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో ఆడిన 5 మ్యాచుల్లో 3 హాఫ్ సెంచరీలు చేసి.. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా సంజు నిలిచాడు.

# టీ20ల్లో అమేలియా కొత్త చరిత్ర

## అత్యంత వేగంగా వెయ్యి పరుగులు, వంద వికెట్లతో రికార్డు..!

**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ క్రికెటర్ అమేలియా కేర్ చరిత్ర సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో చెలరేగిపోతున్న కివీస్ కెప్టెన్ రెండో టీ20 మ్యాచ్‌లో వందో వికెట్ సాధించింది. తద్వారా టీ20ల్లో ఆమె అరుదైన మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు బాదేసి, వందకు పైగా వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా అమేలియా అవతరించింది. ఈ ఆల్‌రౌండర్ 94వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్ సొంతం చేసుకుంది. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లతో చరిత్ర లిఖించిందీ డాషింగ్ బ్యాటర్. మొత్తంగా.. తమ దేశం నుంచి ఈ ఘనత సాధించిన మూడో క్రికెటర్ తనే. ఆమె కంటే ముందు సోఫీ డెవినె, మిచెల్ శాంట్నర్ ఈ మార్క్ అందుకున్నారు.

### క్యారీ చాన్.. 74 ఇన్నింగ్స్‌ల్లోనే

ఓవరాల్‌గా చూస్తే.. అసోసియేట్ నేషన్స్ క్రికెటర్ క్యారీ చాన్ 74 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని దాటింది. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వెటరన్ ఆటగాడు 84 ఇన్నింగ్స్‌ల్లో వెయ్యికి పైగా రన్స్, వందకు పైగా వికెట్లు సాధించాడు. మహిళా క్రికెటర్ల పరంగా చూసుకుంటే... దీప్తి శర్మ (భారత్), నిడా దార్(పాకిస్థాన్), ఎలీసా పెర్రీ(ఆస్ట్రేలియా), సోఫీ డెవినె(న్యూజిలాండ్), హీలీ మాథ్యూస్(వెస్టిండీస్)లు ఈ క్లబ్‌లో ఉన్నారు.



# ముంబై మహిళల టీ20 లీగ్‌కు వేళాయె

**ముంబై :** ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) మరో వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఇప్పటికే పురుషుల టీ20 లీగ్ ద్వారా దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన ఎమ్‌సీఏ తాజాగా తొలిసారి మహిళల లీగ్‌కు సిద్ధమైంది. దేశంలో మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుంటూ ఎమ్‌సీఏ అరంగేట్రం టీ20 లీగ్ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా సోమవారం రెండు టోర్నీలకు సంబంధించిన ట్రోఫీలను టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో ముంబై క్రికెటర్ సయాలీ సత్ఘరెతో పాటు ఎమ్‌సీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్, అశిష్ షెలార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ 'క్రికెట్ అభివృద్ధి కోసం ఎమ్‌సీఏ చేస్తున్న కార్యక్రమాలపై సంతోషంగా ఉన్నాను. కేవలం ఐపీఎల్ ద్వారానే కాకుండా టీ20 ముంబై లీగ్ ద్వారా మరింత మంది యువ ప్లేయర్లకు అవకాశం కల్పిస్తున్నది. ముంబై టీ20 లీగ్‌లో ఆడిన ప్లేయర్లలో చాలా మంది ఐపీఎల్‌తో పాటు జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు' అని అన్నాడు.



# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే: రషీద్ ఖాన్





**బాగ్దాద్:** ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడి వల్ల కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రహీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల వల్లే ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యారు.

సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉన్నట్లు చెప్పారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.




# వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్

కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఆ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.






# వ్యక్తిగత జీవితీలపై కెమెరాల కన్ను

## ముంబై నుంచి చెన్నైకి పాకిన జాడ్యం

## విజయ్, త్రిషల వ్యవహారంపై ఖుష్బూ

విజయ్, త్రిషల గురించి కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై నటి ఖుష్బూ మరోమారు స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి మాట్లాడుతూ.. ఆమె చాలా హుందాగా ఉంటుందన్నారు. తెలియని వారు చేసే కామెంట్స్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. 'ప్రస్తుతం మనం ఎలాంటి రోజుల్లో ఉన్నామంటే.. ఎవరైనా తుమ్మినా వాళ్లను నిందించేస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరం. నాకు విజయ్, త్రిష ఇద్దరూ బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష నాకు చాలా సన్నిహితురాలు. నాకు తెలిసిన గొప్ప మహిళల్లో తను ఒకరు. ఎంతో మృదుస్వభావి అని చెప్పారు. ఇక రూమర్స్ సృష్టించేవారు, ఫొటో గ్రాఫర్లను ఉద్దేశించి ఖుష్బూ మాట్లాడుతూ.. ఈ ఫొటోగ్రాఫర్లు ప్రతిచోటా సెలబ్రిటీల వెనకపడటం అనేది ముంబయిలో చూస్తుంటాం. ఇప్పుడు ఆ సంస్కృతి చెన్నైలో కూడా మొదలవడం బాధాకరం. ఎదుటివారి వ్యక్తిగత జీవితాల గురించి కామెంట్స్ చేసేవారు.. తమ సమస్యల కంటే ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే ఇష్టపడతారు. ఒకరి గురించి తప్పుగా మాట్లాడుతూ వారు ఒక రకమైన పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో 99.9 శాతం మంది ఎవరో కూడా మనకు తెలియదు. అలాంటివారు చేసే వ్యాఖ్యలకు స్పందిస్తూ మన విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తున్నాను అని ఖుష్బూ అన్నారు. ఇటీవల కూడా ఖుష్బూ వీరిద్దరి గురించి మాట్లాడారు. 'ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థంకావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు?' అని పేర్కొన్నారు.

# గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్ట్స్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నారు. నెక్ట్స్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.



# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కల్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.



# ప్రభాస్ .. ఫౌజీ దసరాకు పక్కా

## శరవేగంగా సాగుతున్న షూటింగ్

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామి సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**